



తెలుగు బిడ్డకు భారతరత్న

తెలుగు గడ్డమీద పుట్టిన ఓ వ్యక్తి ఏకంగా ప్రధాని పీఠాన్ని అధిష్ఠించారనేది భవిష్యత్ తరాలు నమ్మలేని నిజం. తుమ్మితే కూలిపోయే ప్రభుత్వాన్ని చిన్న కుదుపు కూడా లేకుండా ఐదేళ్ల పూర్తికాలం పాటు నడిపించిన ఘనత ఆయనది. అవసాన దశకు చేరుకున్న దేశ ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊపిరిలూది ప్రాణం పోయడమే కాదు.. పదవి నుంచి దిగిపోయే నాటికి ప్రపంచంలో శక్తివంతమైన ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా నిలబెట్టిన ధీరత్వం ఆయనది. ఆయన తీసుకొచ్చిన అనేక సంస్కరణలు దేశానికి కొత్త దారిని చూపాయి. ప్రపంచానికి భారత శక్తిని పరిచయం చేశాయి. ఆయనే తెలుగు ప్రజలు ముద్దుగా పిలుచుకునే 'పీవీ'. పూర్తి పేరు పాములపర్తి వెంకట నరసింహారావు. తరతరాలుగా తెలుగువారు గర్వపడేలా పాలన సాగించిన ఆయన నంద్యాల నుంచి ఎంపీగా పోటీ చేసి గెలిచారు. ఐదేళ్లపాటు ప్రధాని పదవికే వన్నె తీసుకొచ్చారు. నవనందుల కోటపై పీవీ నరసింహారావుకు ప్రత్యేకమైన అభిమానం ఉంది. తాజాగా కేంద్ర ప్రభుత్వం ఆయనకు దేశ అత్యున్నత పురస్కారం భారతరత్నను ప్రకటించింది. ఈ సందర్భంగా నంద్యాలకు పీవీ చేసిన సేవలను ఓసారి గుర్తు చేసుకుందాం.

- నంద్యాల నుంచి పీవీ నరసింహారావు ప్రస్థానం
- నాటకీయ పరిణామాల నేపథ్యంలో ప్రధాని
- అక్కున చేర్చుకున్న నంద్యాల ప్రజలు
- ఐదు లక్షల భారీ మెజార్టీతో ఎంపీగా గెలుపు
- నంద్యాల అభివృద్ధిలో పీవీ ప్రత్యేక మార్క్
- భారతరత్న ప్రకటనపై సర్వత్రా హర్షం

నంద్యాల టౌన్, ఫిబ్రవరి 9 : పీవీకి ప్రధానమంత్రి పదవి దక్కడం కూడా భారత రాజకీయాల్లో ఒక సంచలనమే. 1991 లోక్‌సభ ఎన్నికలకు దూరంగా ఉన్న పీవీ.. నాటి కాంగ్రెస్ అధ్యక్షుడు రాజీవ్‌గాంధీ మరణానంతరం పార్టీ జాతీయ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టారు. కాంగ్రెస్ పార్టీ ఆయన్ను ప్రధానమంత్రి అభ్యర్థిగా ఎంపిక చేసింది. అలా ఆ పీఠంపై అధిష్ఠించారు. ఒక్క మాటలో చెప్పాలంటే రాజకీయాల నుంచి రిటైర్మెంట్ తప్పదనుకున్న దశలో ఆయనను ప్రధాని పదవి వరించింది. కానీ, ఆ సమయంలో అది ఓ ముళ్ల కిరీటం. స్థిరత్వం లేని ప్రభుత్వం. దీనికి తోడు చిక్కి శల్యమై చితిపైకి చేరిన ఆర్థిక వ్యవస్థ. కానీ, పీవీ తన సమర్థతతో ఆ గడ్డు పరిస్థితిని దీటుగా ఎదుర్కొన్నారు. ఓ వైపు రాజకీయ చదరంగాన్ని సమర్థవంతంగా ఆడుతూ మైనారిటీ బలంతోనే ప్రభుత్వాన్ని నడిపిస్తూనే... మరో వైపు సంస్కరణలను సమర్థవంతంగా అమలు చేసి ఆర్థికవ్యవస్థను గాడిలో పెట్టారు.



పీవీతో నంద్యాల దివంగత ఎంపీ బొజ్జా వెంకటరెడ్డి (ఫైల్)

పీవీని అక్కున చేర్చుకున్న నంద్యాల

1991లో రాజీవ్‌గాంధీ హత్యతో కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షోభంలో పడిన పరిస్థితుల్లో కోట్ల విజయభాస్కర్ రెడ్డి నంద్యాలలో చక్రం తిప్పారు. అప్పటి నంద్యాల పార్లమెంట్ సభ్యుడిగా ఉన్న గంగుల ప్రతాపరెడ్డితో రాజీనామా చేయించి పీవీ నరసింహారావును పార్లమెంటుకు ఉప ఎన్నికల్లో పోటీ చేయించారు. తొలి తెలుగు వ్యక్తి ప్రధానమంత్రి పదవి చేపట్టడం తెలుగు వారందరికీ గర్వకారణమని అప్పటి ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు భావించారు. అందుకోసమే పీవీ నరసింహారావుకు పోటీగా టీడీపీ అభ్యర్థిని నిలబెట్టలేదు. పీవీ నరసింహారావు బీజేపీ అభ్యర్థి బంగారు లక్ష్మణ్‌పై ఐదు లక్షల భారీ మెజార్టీ సాధించారు. తర్వాత పీవీ ప్రధాని హోదాలో నంద్యాల పార్లమెంట్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టారు.



పీవీతో టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు ఎన్ఎండీ ఫరూక్ (ఫైల్)

పత్తి వంగడానికి 'నరసింహ' పేరు

నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో సీనియర్ శాస్త్రవేత్తగా, పత్తిలో అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన డాక్టర్ కాదర్‌బాద్ రవీంద్రనాథ్ రూపొందించిన పత్తి వంగడానికి దివంగత ప్రధాని పీవీ నరసింహారావు పేరు పెట్టారు. ఆయన ప్రధానిగా ఉన్న సమయంలో నంద్యాలకు నేషనల్ సీడ్స్ కార్పొరేషన్ (జాతీయ విత్తనాభివృద్ధి సంస్థ)ను మంజూరు చేసి ఈ ప్రాంత వ్యవసాయ రంగ అభివృద్ధిలో భవిష్యత్తు తరాలు సైతం గుర్తించుకునే స్థాయిలో పలు వ్యవసాయ రంగ అభివృద్ధికి చేయూతను అందించారు. 1995లో డాక్టర్ కె.రవీంద్రనాథ్ కొత్త పత్తి వంగడాన్ని సృష్టించి, ప్రధాని పీవీ పేరు పెట్టారు. ఈ కొత్త వంగడానికి నరసింహ అనే పేరుతో ప్రాచుర్యం పొందింది. ఇప్పటికీ నరసింహ పత్తి రకం జాతీయ స్థాయిలో అత్యధిక దిగుబడి ఇచ్చేదిగా ఉంది. కాగా పీవీకి భారతరత్న పురస్కారం లభించడం గర్వకారణంగా భావిస్తున్నట్లు సీనియర్ పత్తి శాస్త్రవేత్త డాక్టర్ కె.రవీంద్రనాథ్ పేర్కొన్నారు.



1995లో ప్రధానమంత్రి హోదాలో నూతన పత్తి వంగడాన్ని పరిశీలిస్తున్న పీవీ నరసింహారావు

ముగ్గురికి భారతరత్న



భారత ప్రధాని హోదాలో పీవీ నరసింహారావు నంద్యాల ఎంపీగా ప్రాతినిధ్యం వహించడంతో దేశ రాజకీయ చరిత్రలో ఈ ప్రాంతానికి ఒక గుర్తింపు లభించింది. పీవీతో పాటు వ్యవసాయ రంగ అభివృద్ధికి పాటుపడిన మాజీ ప్రధాని చౌదరి చరణ్‌సింగ్, వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ ఎంఎస్ విశ్వనాథ్‌లకు అత్యున్నత పురస్కారం లభించడం సంతోషంగా ఉంది. నా తండ్రి బొజ్జా వెంకటరెడ్డితో పీవీ సాన్నిహిత్యం మరువలేనిది.

- బొజ్జా అగ్రి ఫౌండేషన్ ఛైర్మన్ దశరథరామిరెడ్డి

పీవీతో పని చేయడం గర్వకారణం



భారత ప్రధానిగా పీవీ నరసింహారావు, నంద్యాల ఎంపీగా ప్రాతినిధ్యం వహిస్తున్న సందర్భంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు డిప్యూటీ స్పీకర్ హోదాలో పని చేయడం ఎంతో గర్వకారణం. నంద్యాల నుంచి ఎంపీగా పీవీ నిలబడితే ప్రత్యర్థిగా టీడీపీ అధ్యక్షుడు ఎన్టీ రామారావు ఎవరినీ నిలబెట్టలేదు. తెలుగు వ్యక్తి ప్రధాని హోదాలో పోటీ చేస్తే పోటీకి నిలబెట్టడం సబబు కాదంటూ ఆనాడు ఎన్టీఆర్ నిర్ణయం తీసుకున్నారు. దీంతో పీవీ 5 లక్షల మెజార్టీతో గెలిచారు.

- ఎన్ఎండీ ఫరూక్, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు

సముచిత గౌరవం



బహుభాషా కోవిదుడు, ఆర్థిక సంస్కరణలతో దేశ ఆర్థిక పరిస్థితిని గాడిన పెట్టిన దివంగత ప్రధాని పీవీ నరసింహారావుకు భారతరత్న పురస్కారం లభించడమంటే ఆయనను గౌరవించుకోవడమే. కాంగ్రెస్ పార్టీలో అత్యున్నత పదవుల్లో అలంకరించిన తెలుగు వ్యక్తిగా గుర్తింపు దక్కించుకున్నారు. పీవీ నరసింహారావు నిబద్ధత కలిగిన నాయకుడు. భావి తరాలకు ఆయన ఆదర్శప్రాయుడు. పీవీ ప్రధానిగా ఉన్నప్పుడు మీటర్ గేజ్ లైన్‌ను బ్రాడ్‌గేజ్‌గా మార్చారు. నూనెపల్లె ఓవర్ బ్రిడ్జి నిర్మాణం వంటి ఎన్నో అభివృద్ధి పనులు జరిగాయి.

- కే.లక్ష్మీనరసింహ యాదవ్, డీసీసీ అధ్యక్షుడు

ఆర్థిక సంస్కరణవేత్త పీవీ

ఆర్థిక సంస్కరణల ద్వారా దేశం ఎదుర్కొంటున్న క్లిష్ట సమస్యలను అధిగమించి పురోభివృద్ధి వైపు నడిపించిన మేధావి, సంస్కరణ వేత్త దివంగత ప్రధాని పీవీ నరసింహారావు. పీవీకి భారతరత్న పురస్కారం లభించడం సంతోషం కలిగించింది. ప్రముఖ జాతీయ కిసాన్ నాయకులు మాజీ ప్రధాని చౌదరి చరణ్‌సింగ్‌కు కూడా భారతరత్న ఇవ్వడం సంతోషం.

-ఉమామహేశ్వరరెడ్డి, అధ్యక్షుడు, నంది రైతు సమాఖ్య





నంద్యాలలో జరిగిన ఎన్నికల సభలో ప్రసంగిస్తున్న పీవీ నరసింహారావు (ఫైల్)

పీవీ పాలనలో స్వర్ణయుగం

నంద్యాల ఎంపీగా గెలిచిన పీవీ నరసింహారావు పార్లమెంట్ పరిధిలో వివిధ అభివృద్ధి పనులకు భారీ ఎత్తున నిధులు మంజూరు చేయించారు. ప్రధానంగా గుంటూరు-గుంతకల్లు మీటర్ గేజ్ రైలు మార్గాన్ని బ్రాడ్‌గేజ్‌గా మార్చారు. కర్నూలు-చిత్తూరు రహదారిని జాతీయ రహదారిగా మార్చారు. జాతీయ విత్తనాభివృద్ధి సంస్థను ఏర్పాటు చేశారు. ఉమ్మడి జిల్లాలో మంచినీటి ఎద్దడి తీర్చేందుకు రూ.కోట్ల వ్యయంతో నంద్యాల మంచినీటి పథకాన్ని ఏర్పాటు చేశారు. పీవీ హయాంలోనే నంద్యాల వ్యవసాయ కళాశాలను సైతం ఏర్పాటు చేశారు. నూనెపల్లె వద్ద ఓవర్ బ్రిడ్జిని నిర్మించారు. ఆత్మకూరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పీవీకి భారీ మెజారిటీ రావడంతో సీపీడబ్ల్యూ స్కీం ద్వారా 12 నల్లమల గ్రామాలకు తాగునీటి పైప్‌లైను వేయించారు. ఆర్ఏఆర్ఎస్ ఏర్పాటుతో పాటు సాగునీటి కోసం ప్రణాళికలు జరిగాయి. నంద్యాలలో గ్రామీణ తాగునీటి పథకం పేరుతో కోట్ల రూపాయలను విడుదల చేసి ప్రజల దాహార్తిని తీర్చింది. గ్రామీణ తాగునీటి సరఫరా పేరుతో ప్రత్యేక శాఖను పీవీ నరసింహారావు ఏర్పాటు చేయించారు. ప్రస్తుతం నంద్యాల సీడ్ హబ్‌లా ఖ్యాతి సాధించడానికి ఆయన చేసిన కృషి ఎంతో ఉంది. ఇలా పలు అభివృద్ధి పనులు పీవీ హయాంలోనే జరిగాయి. ప్రధాని హోదాలో నంద్యాలకు స్థానిక ఎంపీగా మాటిమాటికీ రావడం కష్టమవుతుందని ప్రత్యేకంగా ఒక ఓఎస్డీని నియమించారు. స్థానిక కాంగ్రెస్ నాయకులతో సమన్వయం చేసుకుంటూ నంద్యాల రాజకీయ, సామాజిక, ఆర్థిక రంగాలలో పీవీ నరసింహారావు తనదైన ముద్ర వేసుకున్నారు.

బ్రహ్మోత్సవాలను విజయవంతం చేద్దాం

నంద్యాల కలెక్టర్ కె. శ్రీనివాసులు ● శివరాత్రి వేడుకలపై శ్రీశైలంలో అధికారుల సమీక్ష

శ్రీశైలం, ఫిబ్రవరి 9: శ్రీశైల మహాక్షేత్రంలో మార్చి 1 నుంచి 11వ తేదీ వరకు మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించనున్నారు. శుక్రవారం బ్రహ్మోత్సవ ఏర్పాట్లపై నంద్యాల జిల్లా కలెక్టర్ కె. శ్రీనివాసులు మొదటి సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. దేవస్థానం సీసీ కంట్రోల్ రూమ్‌లో నిర్వహించిన సమావేశంలో ఎస్పీ రఘువీర్‌రెడ్డి, ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి, ఆలయ కార్యనిర్వహణాధికారి డి. పెద్దిరాజు, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని ఆదేశించారు. ఉత్సవాల్లో ప్రధానంగా ట్రాఫిక్, పార్కింగ్, పారిశుధ్యం, తాగునీటి సదుపాయం, వైద్య సదుపాయం తదితర అంశాలపై అప్పగించిన విధులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి నిర్వర్తించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. శ్రీశైలం, సుండిపెంటలోని వైద్యశాలలో 24 గంటలు సేవలందించేలా డాక్టర్లను కేటాయించాలని, ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని, అవసరమైన మందులను సిద్ధంగా ఉంచుకోవాలని డీఎంహెచ్ఓను ఆదేశించారు. ఆంధ్రప్రదేశ్ నుంచి 500 బస్సులు, తెలంగాణ నుంచి 450 బస్సులను, కర్ణాటక నుంచి 170 సర్వీసులను కండిషన్‌లో ఉన్న సర్వీసులను ఏర్పాటు చేయాలని ఆర్టీసీ ఆర్ఎంను ఆదేశించారు. 11 రోజుల పాటు జరిగే ఉత్స వాలకు దాదాపు పది లక్షల మందికిపైగా భక్తులు వచ్చే అవకాశం ఉందని, ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలతోపాటు అతనంగా మరో 75 కెమెరాలు, డ్రోన్లతో ఉత్సవాల ఏర్పాట్లను పరిశీలిస్తూ అవసరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. అనంతరం జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు పటిష్ఠ పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. క్షేత్రపరిధిలోని పార్కింగ్ ప్రదేశాలలో దాదాపు 5వేల వాహనాలను నిలుపుదల చేసేందుకు అవకాశం ఉందన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీనివాసులు

వేడుకలు ఇలా...

శివరాత్రి వేడుకలకు సంబంధించిన వివరాలను ఆలయ ఈఓ పెద్దిరాజు వెల్లడించారు. 3వ తేదీన దుర్గామల్లేశ్వరి దేవస్థానం, 4వ తేదీన కాణిపాక వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానం, తిరుమల తిరుపతి దేవస్థానం, 5వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం తరఫున స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలను సమర్పిస్తారని తెలిపారు. 8వ తేదీ మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని సాయంత్రం ప్రభోత్సవం నిర్వహించి, రాత్రి 10 గంటల నుంచి పాగాలంకరణ, లింగోద్భవకాల మహాన్యాస రుద్రాభిషేకం, అర్ధరాత్రి 12 గంటలకు స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 9వ తేదీ సాయంత్రం రథోత్సవం, తెప్పోత్సవం నిర్వహించనున్నట్లు వివరించారు. స్వామి, అమ్మవార్ల దర్శనం సులభంగా జరిగేందుకు నాలుగు రకాల క్యూలైన్లను ఏర్పాటు చేశామని వివరించారు.



గుమ్మకొండలో కోట్ల సూర్యప్రకాష్ రెడ్డికి పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న దృశ్యం

వైసీపీని ఇంటికి పంపడం ఖాయం: కోట్ల

డోన్, ఫిబ్రవరి 9: రాష్ట్రంలో దోపిడీ పాలన సాగిస్తున్న వైసీపీ ప్రభుత్వాన్ని ప్రజలు ఇంటికి పంపడం ఖాయమని కేంద్ర మాజీ మంత్రి, టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. శుక్రవారం సాయంత్రం డోన్ మండలం గుమ్మకొండ గ్రామ సమీపంలోని ఆంజనేయస్వామి ఆలయంలో కోట్ల ప్రత్యేక పూజలు నిర్వహించారు. గుమ్మకొండ సర్పంచ్ దశరథరామిరెడ్డి ఆధ్వర్యంలో పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ సీఎం జగన్ అరాచక పాలన సాగిస్తూ రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించారని ఆరోపించారు. అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేసి నియంత పాలన సాగిస్తున్న జగన్‌కు పతనం తప్పదన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయించకుండా వైసీపీ ప్రభుత్వం అన్యాయం చేసిందని మండిపడ్డారు. కరువు రైతులను ఉదారంగా ఆదుకోవాల్సిన ప్రభుత్వమే కరువు మండలాలుగా ప్రకటించకుండా రైతులకు తీరని నష్టం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రసాదం అపవిత్రం..!

- ప్రసాదంలో ఎముక ముక్కలు
- విచారణకు ఆదేశించిన ఆలయ అధికారులు
- ఘటనపై మండిపడుతున్న భక్తులు


పులిహోరలో దర్శనమిచ్చిన ఎముక ముక్కలు

శ్రీశైలం, ఫిబ్రవరి 9: శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్ల ప్రసాదంలో ఎముక ముక్కలు ప్రత్యక్షమవడం కలకలం రేపింది. హైదరాబాద్‌కు చెందిన ఐదుగురు భక్తులు శ్రీశైలం స్వామి, అమ్మవార్ల దర్శనార్థం శ్రీశైలం వచ్చారు. శుక్రవారం ఉదయం మల్లన్న దర్శనం చేసుకుని భ్రమరాంబికా అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయం వెలుపలికి వచ్చే సమయంలో భక్తులందరికీ తీర్థ ప్రసాదాలను అందజేస్తున్నారు. ఈ క్రమంలో వేణుగోపాల్ అనే వ్యక్తి అమ్మవారి ప్రసాదం పులిహోరను స్వీకరించాడు. అయితే పులిహోర ప్రసాదంలో రెండు ఎముకముక్కలు రావడంతో భక్తుడు కంగుతిన్నాడు. అమ్మవారి ప్రసాదంలో ఎముక ముక్కలు ఎలా వచ్చాయని వెంటనే వాటిని తమ ఫోన్లలో చిత్రీకరించి ఆలయ అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. స్వామి, అమ్మవార్ల ప్రసాదంలో ఎముక ముక్కలు రావడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. దీనిపై ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి హరిదాసును వివరణ కోరగా విచారణకు ఆదేశించామని తెలిపారు. ఈ విషయం తెలిసిన భక్తులు పరమ పవిత్రమైన శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లు కొలువైవున్న మహాపుణ్యక్షేత్రంలో అమ్మవారికి నివేదించిన ప్రసాదంలో ఎముక ముక్కలు ప్రత్యక్షమవడంపై భక్తులు తీవ్రంగా మండిపడుతున్నారు. శ్రీశైలం పుణ్యక్షేత్రం పవిత్రతకు భంగం కలిగే విధంగా వ్యవహరిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు. భక్తులు వారి మొక్కులను తీర్చుకునేందుకు ఎంతో పవిత్రంగా ఇంటి వద్ద పూజలు నిర్వహించుకుని శ్రీశైల మల్లన్న దర్శనానికి వస్తారు. స్వామి, అమ్మవార్లకు మొక్కులు తీర్చుని స్వామి, అమ్మవార్ల ప్రసాదాలను స్వీకరిస్తారు. అటువంటి ప్రసాదంలో ఎముక ముక్కలు రావడం సిబ్బంది నిర్లక్ష్యమా..అధికారుల పర్యవేక్షణ లోపమా..అని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఘటనపై బీజేపీ నంద్యాల జిల్లా అధ్యక్షురాలు శబరి స్పందిస్తూ భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా పాలన జరుగుతోందని మండిపడ్డారు. ఇదిలా ఉండగా ఎవరైనా ఉద్దేశపూర్వకంగా చేసి ఉంటారా? అన్న అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి.

దేవదాయ శాఖలో అసిస్టెంట్ కమిషనర్లుగా పదోన్నతి

కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 9: దేవదాయ శాఖలోని నలుగురు అసిస్టెంట్ కమిషనర్లకు డిప్యూటీ కమిషనర్లుగా పదోన్నతి కల్పించిన విషయం తెలిసిందే. ఇదే క్రమంలో శుక్రవారం నాడు మరో నలుగురు సూపరింటెండెంట్, గ్రేడ్-1 ఈవోలను అసిస్టెంట్ కమిషనర్లుగా పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాలో నలుగురు అసిస్టెంట్ కమిషనర్లుగా పదోన్నతి పొందారు. నంద్యాల జిల్లా దేవదాయ శాఖ అధికారిగా విధులు నిర్వహిస్తున్న టీ. సుధాకర్‌రెడ్డికి అసిస్టెంట్ కమిషనర్‌గా పదోన్నతి కల్పించారు. కర్నూలు జిల్లా అసిస్టెంట్ కమిషనర్‌గా డిప్యూటీ కమిషనర్ కార్యాలయంలో పని చేస్తున్న పాండురంగారెడ్డికి అసిస్టెంట్ కమిషనర్‌గా పదోన్నతి కల్పించారు. కర్నూలు డివిజన్ జ్యూవెల్లరీ వెరిఫికేషన్ ఆఫీసర్‌గా కర్నూలు జిల్లాలో విధులు నిర్వహిస్తున్న జి. కామేశ్వరమ్మ, ప్రసన్న లక్ష్మిలను అసిస్టెంట్ కమిషనర్లుగా పదోన్నతి కల్పించారు. జి. కామేశ్వరమ్మను నంద్యాల జిల్లా నందవరం మండలం శ్రీచౌడేశ్వరి దేవతా దేవస్థానం కార్యనిర్వహణాధికారిగా, ప్రసన్న లక్ష్మిని చిత్తూరు జిల్లా అసిస్టెంట్ కమిషనర్‌గా నియమిస్తూ బదిలీ చేసినట్లు డిప్యూటీ కమిషనర్ కార్యాలయం అధికారులు పేర్కొన్నారు.

ఇంటర్ సైన్స్ ప్రాక్టికల్స్‌లో పొరపాట్లు రానీవద్దు


ఆర్ఐవో గురువయ్యశెట్టి


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్ఐవో ఎస్‌వీఎస్ గురువయ్యశెట్టి

కర్నూలు(ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 9: ఈ నెల 11వ తేదీ నుంచి 20వ తేదీ వరకు జరిగే ఇంటర్మీడియట్ జనరల్ కోర్సు సైన్స్ ప్రాక్టికల్స్ పరీక్షల్లో పొరపాట్లకు తావివ్వరాదని పరీక్షల నిర్వాహకులను ఎగ్జామినేషన్స్ కన్వీనర్, ఆర్ఐవో ఎస్‌వీఎస్ గురువయ్యశెట్టి సూచించారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సైన్స్ ప్రాక్టికల్స్ పరీక్షలను పారదర్శకంగా నిర్వహించాలన్నారు. జనరల్ కోర్సు సైన్స్ ప్రాక్టికల్స్ పరీక్షలకు మొత్తం 14534 మంది విద్యార్థులు హాజరవుతున్నారని అన్నారు. ఇందులో ఎంపీసీ విద్యార్థులు 9750 మంది, బైపీసీ గ్రూపు విద్యార్థులు 4784 మంది హాజరవుతున్నారని అన్నారు. మొదటి విడత సైన్స్ ప్రాక్టికల్స్ పరీక్షలు 11 నుంచి 14వ తేదీ వరకు జరుగుతాయన్నారు. 77 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. అలాగే రెండో విడత సైన్స్ ప్రాక్టికల్స్ పరీక్షలు 15వ తేదీ నుంచి 20వ తేదీ వరకు కొనసాగుతాయన్నారు. అందుకు 38 పరీక్ష కేంద్రాలను సిద్ధం చేసినట్లు ఆయన తెలిపారు. ఈ పరీక్షలు ప్రతి రోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మొదటి సెషన్స్ మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండో సెషన్స్ పరీక్ష జరుగుతుందన్నారు. ఈ పరీక్షలకు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశామన్నారు. పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. అన్ని కేంద్రాలను అనుసంధానం చేసి పర్యవేక్షిస్తామన్నారు. ఎక్కడైనా పొరపాట్లు జరిగితే.. పరీక్ష కేంద్రాల నిర్వాహకులే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. ఈ పరీక్ష కేంద్రాలను ఆర్ఐవో, డీఈసీ కమిటీ, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు పర్యవేక్షిస్తాయని అన్నారు. జిల్లా కేంద్రంలో కంట్రోల్ రూమ్ నెంబరు 8121127019, ల్యాండ్ నెంబర్.08518-222047లను ఏర్పాటు చేశామని, ఎక్కడైనా ఏదైనా సమస్య ఎదురైతే ఈ నెంబర్లను సంప్రదించాలన్నారు. ఈ సమావేశంలో డీఈసీ మెంబర్లు పరమేశ్వరరెడ్డి, జే.లాలెప్ప, ప్రభు పాల్గొన్నారు.

నగలకు మెరుగు పెడతామని బురిడీ

మత్తుమందు ఇచ్చి నాలుగు తులాల బంగారు చోరీ


దుండగులు ఉపయోగించిన గిన్నెలు

ఎమ్మిగనూరు, ఫిబ్రవరి 9: బంగారు నగలకు మెరుగు పెడతామనే పేరుతో ఇద్దరు దుండగులు ఓ మహిళను మోసగించారు. మాయ మాటలు చెప్పి, మత్తుమందు ఇచ్చి నాలుగు తులాల బంగారుచైను, ఉంగరాన్ని ఎత్తుకెళ్లిన ఘటన ఎమ్మిగనూరు పట్టణంలోని లక్ష్మీపేటలో చోటుచేసుకుంది. ఈరన్న, ఉమాదేవి దంపతులు లక్ష్మీపేటలో నివాసం ఉంటున్నారు. ఈరన్న దుకాణానికి వెళ్లటంతో ఇంట్లో ఉన్న ఉమాదేవి వద్దకు దుండగులు వచ్చి బంగారు, వెండి నగలకు, ఇత్తడి, రాగి వస్తువులకు మెరుగులు పెడతామని నమ్మబలికారు. అంతేగాక తమ వద్ద బంగారు నగలకు మెరుగు దిద్దే పౌడర్ ఉందని తీసుకోవాలన్నారు. ఇందుకు ఉమాదేవి తమకు అవసరం లేదని చెప్పింది. అయితే ఇత్తడి వస్తువులను మెరుగు చేస్తుండగా కుమార్తె వెండి పట్టీలు మెరుగు కోసం ఉమాదేవి ఇచ్చింది. అనంతరం భర్త ఉంగరంతో పాటు మూడు తులాల బంగారు గొలుసును మెరుగు కోసం ఇచ్చింది. అంతలోనే ఆమె చేతిలో తెల్లటి పౌడర్ ఇవ్వడంతో ఆమె మత్తులోకి జారుకుంది. ఆ వెంటనే దుండగులు ఉంగరం, బంగారు గొలుసు, వెండి పట్టీలతో ఉడాయించారు. కాసేపటి తర్వాత తేరుకున్న ఉమాదేవి భర్తతో కలసి పోలీసులను ఆశ్రయించింది. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మంత్రాలయం అభివృద్ధికి కృషి

- భక్తుల సౌకర్యార్థం 12 అంతస్థుల భవనం ఏర్పాటుకు ప్రణాళిక
- వంద ఎకరాల్లో తాగునీటి ఏర్పాటుకు సన్నాహాలు
- పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు వెల్లడి


తిక్కారెడ్డితో చర్చిస్తున్న పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు

మంత్రాలయం, ఫిబ్రవరి 9: మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠం సర్వముఖాభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేసినట్లు మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు అన్నారు. శుక్రవారం ఆయన పట్టణ ప్రముఖులు, విలేకరులతో మాట్లాడారు. రాఘవేంద్ర సర్కిల్‌లోని పాత ఆర్‌అండ్‌బీ భవనంలో తాను శ్రీమఠం పీఠాధిపతిగా 12 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా 12 అంతస్థుల భవనాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. భక్తులకు క్లాక్‌రూమ్, వసతి, పార్కింగ్, పరిమళ ప్రసాదం సేవా కౌంటర్లు వంటి వసతులు కల్పించేందుకు ఇప్పటికే దాతలు ముందుకు వచ్చారనితెలిపారు. అదేవిధంగా మంత్రాలయం గ్రామానికి వంద ఎకరాల్లో ఎస్ఎస్ ట్యాంకును నిర్మించి శుద్ధజలాన్ని అందించేందుకు ఇప్పటికే ప్రణాళిక రూపొందించామన్నారు. మంత్రా లయం శివారులో మినీ ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు స్థల పరిశీలన జరుగుతోందన్నారు. ఇన్ఫోసిస్ సుధానారాయణమూర్తి, టాటా గ్రూప్స్, రిలయన్స్ అధినేత అంబానీలు మంత్రాలయం అభివృద్ధికి సహకరిస్తున్నట్లు తెలిపారు. భక్తుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్న దృష్ట్యా వసతులు, తాగునీరు, పరిశుభ్రత పాటించేందుకు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పూజారి వ్యాసరాజాచార్, జోనల్ మేనేజర్ శ్రీపతాచార్, ద్వారపాలక అనంత స్వామి, పవనాచార్, భీమ్‌సేన్‌రావు, వ్యాసరాజాచార్ పాల్గొన్నారు.

పీఠాధిపతిని కలిసిన తిక్కారెడ్డి : మంత్రాలయం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులను నియోజకవర్గ ఇన్‌చార్జి పాలకుర్తి తిక్కారెడ్డి కలిశారు. ఈయనతో పాటు టీడీపీ మండల కన్వీనర్ వెంకటేశ్, బూదూరు మల్లికార్జున రెడ్డి, ఎల్లారెడ్డి, విజయరామిరెడ్డి, వెంకటేశ్, పవన్ కుమార్ రెడ్డి, అబ్దుల్లా, గోపాల్, జెట్టి వీరేష్, చంద్ర తదితరులు పీఠాధిపతిని కలిశారు.

రైతుల కోసం సారథి పోర్టల్

- ఇక సేవలన్నీ డిజిటల్‌లోనే
- ప్రారంభించిన కేంద్ర వ్యవసాయ మంత్రి అర్జున్ ముందా

కర్నూలు(అగ్రికల్చర్), ఫిబ్రవరి 9: ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకంతో పాటు పలు బీమా ఉత్పత్తులు, సేవలను రైతులకు డిజిటల్ పద్ధతిలో అందించడానికి సారథి అనే వెబ్ పోర్టల్‌ను కేంద్ర వ్యవసాయ మంత్రి అర్జున్ ముందా గురువారం ప్రారంభించారని, దీని వల్ల రైతులకు సకాలంలో అన్ని ప్రయోజనాలు అందుబాటులోకి వస్తాయని వ్యవసాయ శాఖ కర్నూలు ఏడీఏ శాలురెడ్డి తెలిపారు. పంటల బీమా పథకం మీద రైతుల ఫిర్యాదులను పరిష్కరించడానికి కిసాన్ రక్షక్ పోర్టల్, 14447 నెంబరు హెల్ప్‌లైన్‌ను మంత్రి ప్రారంభించారన్నారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఫసల్ బీమా, సవరించిన వడ్డీ సబ్సిడీ పథకం, కిసాన్ క్రెడిట్ కార్డుల గురించి రైతులకు సమాచారం అందించే ఏర్పాటు చేశామన్నారు. ఏకగవాక్ష సారథి పోర్టల్ రైతులకు డిజిటల్ పంథాలో పంట బీమా పొందే సౌకర్యాన్ని అందిస్తుందని ఏడీఏ తెలిపారు.

ఈ ఏడాదిలోనే పశుగణన

దేశంలో పశుగణను చేపట్టేందుకు కేంద్ర పశుసంవర్ధకశాఖ సిద్ధమైందని, జనాభా లెక్కల మాదిరిగానే ఈ పశుగణన సెప్టెంబరు-డిసెంబరు మధ్య జరుగుతుందని పశుసంవర్ధక శాఖ జేడీ రామచంద్రయ్య తెలిపారు. మొబైల్ టెక్నాలజీతో ఈ ప్రక్రియను చేపడుతారని, దేశ వ్యాప్తంగా అన్ని గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో మూగజీవాలకు సంబంధించి ఖచ్చితమైన వివరాలను సేకరిస్తామన్నారు.

ముస్లింలను మోసగిస్తున్న కాటసాని

మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బీసీ

బనగానపల్లె, ఫిబ్రవరి 9: కమ్యూనిటీ హాళ్లను నిర్మిస్తూ షాదీఖానాలు అంటూ ముస్లింను ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మోసం చేస్తున్నాడని బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి విమర్శించారు. శుక్రవారం టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గతేడాది నవంబరు నెలలో కోవెలకుంట్లలో, డిసెంబరు నెలలో బనగానపల్లెలో కమ్యూనిటీ హాళ్లను ప్రారంభించి వాటిని షాదీఖానాలు అంటూ ముస్లింలను మోసగించారన్నారు. ఒక్కో కమ్యూనిటీ హాలేను రూ.1.20 కోట్లతో రెండింటిని ఎమ్మెల్యే కాటసాని షాదీఖానాలు అని చెప్పి ముస్లిం మతగురువులతో ప్రార్థనలు చేయించాడన్నారు. వాస్తవానికి అవి షాదీఖానాలు కాదని కమ్యూనిటీ హాళ్లని అన్నారు. అందరూ వివాహాది శుభకార్యాలు చేసుకునేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. కానీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ముస్లిం మైనార్టీలను ఓట్ల కోసం మభ్య పెట్టడానికి బనగానపల్లె, కోవెలకుంట్లలో నిర్మించేవి షాదీఖానాలు అంటూ మోసం చేశాడన్నారు. ఎన్నికల సమయంలో కేవలం మైనార్టీల ఓట్ల కోసమే కాటసాని రామిరెడ్డి ఇలాంటి డ్రామాలు ఆడుతున్నారన్నారు. ముస్లింలకు షాదీఖానాలు నిర్మిస్తే తాము సంతోషంగా స్వాగతిస్తామని, అయితే మైనార్టీలను మోసగిస్తే మాత్రం చూస్తూ ఊరుకోమన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు బనగానపల్లెలో షాదీఖానా కోసం కోటి రూపాయలు నిధులు మంజూరు చేయించానని గుర్తు చేశారు. ఆ నిధులు సరిపోకపోతే రూ.30 లక్షల మేర తన సొంత నిధులు ఇచ్చినట్లు తెలిపారు. కానీ వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఆ షాదీఖానా నిర్మాణాలను నిలిపివేయించి తప్పుచేసిందన్నారు. మళ్లీ తన సొంత నిధులతో షాదీఖానాను పూర్తి చేయాలని పనులు ప్రారంభిస్తే తనపై తప్పుడు కేసులు బనాయించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ అధికారంలోకి రాగానే మక్కస్ మసీదు వద్ద ముస్లింలకు పట్టాలు ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బనగానపల్లె ఉప సర్పంచ్ బురానుద్దీన్, టీడీపీ పట్టణాధ్యక్షుడు కాశీంబాబు, మైనార్టీ నాయకులు రాయలసీమ సలాం, పూల కలాం, అల్తాఫ్ హుసేన్, సయ్యద్ హుసేన్, రజాక్, హర్షద్ తదితరులు పాల్గొన్నారు.

పీఎం జన్‌మన్‌కు కార్యాచరణ సిద్ధం చేయండి

- గిరిజన గూడేల్లో మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యం
- శ్రీశైలం ఐటీడీఏ పీవో రవీంద్రారెడ్డి



మాట్లాడుతున్న శ్రీశైలం ఐటీడీఏ పీవో రవీంద్రారెడ్డి

ఆత్మకూరు, ఫిబ్రవరి 9: గిరిజన సాధికారత, అద్భుత భారతదేశమే లక్ష్యంగా దేశంలోని ఆదివాసీ తెగల అభ్యున్నతికై ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి జన జాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ (పీఎం జనన్‌మన్) కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేసేందుకు కార్యాచరణ రూపొందించాలని శ్రీశైలం ఐటీడీఏ పీవో రవీంద్రారెడ్డి పేర్కొన్నారు. ఈమేరకు శుక్రవారం ఆత్మకూరులోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ భవనంలో చెంచుగూడేల్లో వున్న 14 మండలాల ఎంపీడీవోలతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదివాసీల అభ్యున్నతి కోసం రూ.24వేల కోట్ల బడ్జెట్‌తో కేంద్ర ప్రభుత్వం పీఎం జన్‌మన్ కార్యక్రమాన్ని అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. మొత్తంలో 18రాష్ట్రాలతో పాటు ఒక కేంద్రపాలిత ప్రాంతంలో 9 మంత్రిత్వ శాఖల సమన్వయంతో పీఎం జన్‌మన్ ద్వారా 75పీవీటీజీ కమ్యూనిటీల ఆదివాసీల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఇందులో ప్రధానంగా 11 ప్రాథమిక సౌకర్యాల కల్పనే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లనున్నట్లు చెప్పారు. ప్రత్యేకించి అందరికి ఇళ్లు, ప్రతిఇంటికి తాగునీరు, విద్యుత్, గ్రామగ్రామాన రహదారులు, అందరికి నాణ్యమైన విద్య, ఆరోగ్యం, పౌష్టికాహారం, నైపుణ్య వికాసం, జీవనోపాధులు మెరుగుపర్చడం, ప్రచార సాధనాల సౌకర్యాలను మెరుగుపర్చాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో విజయవంతం చేసేందుకు ఎంపీడీవోలు కార్యాచరణ సిద్ధం చేయాలని అన్నారు. సచివాలయ సిబ్బందితో సమన్వయం చేసుకుని ఆయా గూడేల్లో గిరిజనుల అభ్యున్నతికి చేపట్టాల్సిన ప్రణాళికను రూపొందించాలని వివరించారు. ఈ పీఎం జన్‌మన్ మండల కమిటీకి ఎంపీడీవో చైర్మన్‌గా ఉంటారని, ఆయా శాఖలతో సమన్వయం చేసుకుని గిరిజన గూడేల్లో మౌలిక సదుపాయాల కల్పనకు దృష్టి సారించాలని ఆదేశించారు. అదేవిధంగా ప్రధాన మంత్రి ఉజ్వల యోజన ద్వారా అర్హులైన గిరిజనులకు గ్యాస్‌స్టవ్‌లను పంపిణీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎల్‌డీఎం రవికుమార్, నాబార్డు జీఎం సుబ్బారెడ్డి, హౌసింగ్ డీఈ సుంకిరెడ్డి, ఐటీడీఏ ప్రాజెక్ట్ మేనేజర్ కేజీనాయక్, ప్రాజెక్ట్ హార్టికల్చర్ ఆఫీసర్ ధనుంజయరెడ్డి, వెటర్నరీ డాక్టర్ ధనలక్ష్మి తదితరులు ఉన్నారు.

వెట్టిచాకిరీ చేయించుకుంటే శిక్ష


ప్రసంగిస్తున్న నాగ శ్రీనివాసరావు

కర్నూలు(లీగల్), ఫిబ్రవరి 9: వెట్టిచాకిరీ నిషిద్ధమని, కఠిన శిక్షలకు గురవుతారని కర్నూలు న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీహెచ్ వెంకట నాగ శ్రీనివాసరావు తెలియజేశారు. సెర్వ్ అనే ఎన్‌జీవో సహాయంతో స్థానిక లోక్ అదాలత్ భవనంలో శుక్రవారం జరిగిన ఒక సమావేశంలో ఆయన మాట్లాడుతూ వెట్టిచాకిరీ వంటి సాంఘిక దురాచారాన్ని పీడనాడాలని అన్నారు. లేకపోతే చర్యలు తప్పవని అన్నారు. వెట్టి చాకిరి చేయించుకుంటే మూడు సంవత్స రాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.50వేలు జరిమానా కూడా ఉంటుందని ఆయన హెచ్చరించారు. శాశ్వత లోక్ అదాలత్ అధ్యక్షు డు వెంకట హరినాథ్, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మనోహర్, దిశా డీఎస్పీ ఐ.సుధాకర్ రెడ్డి, ట్రైనీ డీఎస్పీ పి.భవాని, డిప్యూటీ లేబర్ కమిషనర్ వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ లేబర్ కమిషనర్ సాంబ శివ, పలువురు ఎస్‌ఐవో, చైల్డ్ వెల్ఫేర్ డిపార్టుమెంటు అధికారులు, న్యాయ విద్యార్థులు, పారాలీగల్, వలంటీర్లు పాల్గొన్నారు.

అంకెల్లో సంక్షేమం.. ఆచరణలో శూన్యం

నంద్యాల టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్


మాట్లాడుతున్న మల్లెల రాజశేఖర్

ఓర్వకల్లు, ఫిబ్రవరి 9: వైసీపీ అంకెల్లో సంక్షేమం.. ఆచరణలో శూన్యమని నంద్యాల టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ అన్నారు. శుక్రవారం మండలంలోని హుశేనాపురం గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ప్రవేశపెట్టిన బడ్జెట్ ఎన్నికల స్టంట్‌గా ఉందన్నారు. వైసీపీ ఎన్నికల ప్రచారం కోసం బడ్జెట్ ప్రవేశ పెట్టడంలో స్పష్టంగా రాష్ట్ర ప్రజలకు అర్థమవుతుందన్నారు. రాష్ట్రంలో కరువుతో ప్రజలు తల్లడిల్లుతుంటే.. అలాగే వలసలు కొనసాగుతుంటే.. అద్భుతంగా ఉన్నట్లు మంత్రి బుగ్గన అసెంబ్లీలో చెప్పడం దారుణమన్నారు. అభివృద్ధి గురించి చెబుతున్న జగన్ ప్రభుత్వం రాష్ట్రంలో కనీసం రోడ్లు కూడా వేయలేని దుస్థితిలో ఉందన్నారు. ఓటాన్ అకౌంటు బడ్జెట్‌లో అసలు ఈ జిల్లాకు ఎంత కేటాయించారన్నది స్పష్టత లేదన్నారు. రూ.27,884 కోట్లుగా చెప్పిన సర్కార్ సామాన్యులపై విద్యుత్ చార్జీల రూపంలో ఇప్పటికే రూ. వేల కోట్ల భారం మోపిందని మండిపడ్డారు. ఎన్నికల ముందు మద్య నిషేధం అని చెప్పి.. అధికారంలోకి రాగానే జగన్ తన బ్రాండ్లను అమ్మి కోట్లాది రూపాయలు పొందారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గడేకారి శేఖర్, నాగరాజు పాల్గొన్నారు.

విద్యార్థి ఆత్మహత్యాయత్నం

కోసిగి, ఫిబ్రవరి 9: మండల కేంద్రంలోని ఓ పాఠశాల విద్యార్థి తండ్రి మందలించాడని వ్యవసాయానికి తెచ్చిన పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వెంటనే కుటుంబ సభ్యులు కోసిగి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. డాక్టర్ల సూచనల మేరకు మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. సక్రమంగా చదువుకోవాలని, బడికి వెళ్లాలని తండ్రి మందలించడంతో ఆత్మహత్యాయత్నం చేశాడని కుటుంబ సభ్యులు తెలిపారు.

కాలువలో పడి వైసీపీ నాయకుడిమృతి

నందికొట్కూరు ఫిబ్రవరి 9: మిడ్తూరు మండలం పీరుసాహెబ్‌పేట గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు కైపా శ్రీధర్‌రెడ్డి ప్రమాదవశాత్తు హెచ్ఎన్ఎస్ఎస్ కాలువలో పడి మృతి చెందారు. గత రెండు రోజుల క్రితం కర్నూలులో పనులు ముగించుకొని తన స్వగ్రామానికి వెళ్తుండగా మార్గమధ్యంలో ఉన్న హెచ్ఎన్ఎస్ఎస్ కాలువలో ప్రమాదవశాత్తు పడ్డారు. ఆయన మద్యం సేవించి ఉన్నందు వల్ల నీటిలో కొట్టుకుపోయారు. కాలువ పక్కన ద్విచక్ర వాహనం ఉండడంతో కుటుంబ సభ్యులు గుర్తించి కాలువలో గాలింపు చర్యలు చేపట్టారు. వెల్దుర్తి మండలం మల్లెపల్లె వద్ద శ్రీధర్‌రెడ్డి మృతదేహం లభించింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. శ్రీధర్‌రెడ్డి మృతదేహాన్ని మాజీ ఎమ్మెల్యేలు లబ్బి వెంకటస్వామి, ఐజయ్య, వైసీపీ సమన్వయకర్త దార సుధీర్, మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, టీడీపీ నాయకులు మిడ్తూరు మండల కన్వీనర్ ఖాతా రమేష్‌రెడ్డి, టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ జయసూర్య వేర్వేరుగా సందర్శించి నివాళి అర్పించారు.

ఎమ్మిగనూరులో దారుణం

- అనంతపురంవాసిపై వేటకొడవలితో దాడి
- తీవ్ర గాయాలు, కర్నూలుకు తరలింపు
- ఆర్థిక లావాదేవీలే దాడికి కారణం


ఘటనా స్థలంలో వీర నారాయణను పరిశీలిస్తున్న పోలీసులు

ఎమ్మిగనూరు, ఫిబ్రవరి 9: ఎమ్మిగనూరు పట్టణంలోని కోర్టు రోడ్డులో శుక్రవారం దారుణం చేటుచేసుకుంది. అనంతపురం జిల్లా కనగానపల్లి మండలం దాదులూరు గ్రామానికి చెందిన బుట్ట వీర నారాయణపై సీ బెళగల్ మండలం కంబదహాల్(తూర్పు కంపాడు)గ్రామానికి చెందిన కురువ ఈరన్న కొడవలితో విచక్షణారహితంగా దాడిచేశాడు. కురువ వీర నారాయణ, కురువ ఈరన్నల మధ్య ఆర్థిక లావాదేవీలు ఉన్నాయి. ఓ చెక్ బౌన్స్ కేసులో వీరనారాయణ కోర్టు హాజరయ్యాక, బయట చెట్టు కింద నిలబడి ఉన్నాడు. అప్పటికే కోర్టు బయట కాపు కాసుకొని ఉన్న ఈరన్న కొడవలితో వీర నారాయణపై దాడికి పాల్పడ్డాడు. తప్పించుకొని పరుగుతీసేందుకు ప్రయత్నించగా వెంటపడి వీరనారాయణను తలపైన, గొంతుపైన పొడి చేశాడు. దీంతో వీరనారాయణ కుప్పకూలి పడిపోయాడు. పోలీసులకు సంఘటనా స్థలానికి చేరుకొని రక్తంపు మడుగులో పడి ఉన్న వీర నారాయణను చికిత్స నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం కర్నూలు జీజీహెచ్‌కు తరలించారు. పట్టణ ఇన్‌చార్జి సీఐ మోహన్ రెడ్డి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి చిన్న ప్రకటన - పెద్ద స్పందన CLASSIFIEDS

HOUSE FOR SALE
కొత్తగా, నాణ్యవంతంగా నిర్మించిన ఇల్లు (2BHK) అమ్మకమునకు కలదు. (తిరుమలగిరి - డోన్ రోడ్, కర్నూలు నందు.) Contact : 63043 88820
AJL-1180098

LAND FOR SALE
ఓర్వకల్లు పాడు గ్రామంలో అలంపూర్‌కు పోయే దారిలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ దగ్గరలో 69/2 సర్వే నెంబర్ గల ల్యాండ్ కన్వర్షన్ అయిన 1.3 ఎకరం గల ల్యాండ్ అమ్మకానికి కలదు. సంప్ర. 99896 42433, 94923 23013
AJL-1180097

ప్లాటు అమ్మబడును
గుడికల్లు పంచాయితీచే అప్రూవ్డ్ ప్లాట్లు " శాంతి రియల్ ఎస్టేట్ " నందు Plot Nos.140 A, 140 B ఉత్తర దిక్కు తూర్పు - పడమర : 48 అ., ఉత్తర - దక్షిణం : 50 అ., కలదు. 5 1/2 సెంట్లు. క్లియర్ టైటిల్ డీడ్ C/o 94400 35247.
AJL-155346

ప్లాటు అమ్మబడును
గుడికల్లు పంచాయితీచే అప్రూవ్డ్ ప్లాటు " శాంతి రియల్ ఎస్టేట్ " నందు Plot No.40 B, ఉత్తర దిక్కు గలది. కొలతలు : తూర్పు - పడమర : 24 అ., ఉత్తర - దక్షిణం : 50 అ., కలదు. 2 3/4 సెంట్లు, క్లియర్ టైటిల్ డీడ్ C/o 94400 35247.
AJL-155346

ఉద్యోగ ప్రకటన
అంతర్జాతీయ ప్రమాణాలు కలిగిన ప్రముఖ విద్యాసంస్థ కొరకు మార్కెటింగ్ చేయుటకు అర్హత కలిగిన అభ్యర్థులు కావలెను. వివరములకు సంప్ర : సెల్ : 93929 36712
AJA-150298

VARUN REAL ESTATE
కర్నూలులో ఇల్లు, ప్లాట్స్ కొనబడును & అమ్మబడును. బ్యాంకుల ద్వారా లోన్స్ ఇప్పించబడును. LRS మరియు KMC అప్రూవల్ చేయించబడును. 86-271, సోమప్ప కాలనీ, కర్నూలు. P.G.Singh - 99630 04641
AJL-180222

FOR ADVERTISEMENTS CONTACT. Cell: 99854 11369

బంగారం కొనబడును
మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(సిల్వర్ గోల్డ్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్ర॥ 7382114647
AJA-176957

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటన దారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు. మేనేజర్ - ఏడివిటి

ఆంధ్రజ్యోతి
ఆంధ్రజ్యోతి దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
జన్మదిన శుభాకాంక్షలు
సెల్ : 99854 11369
ఆంధ్రజ్యోతి పత్రిక కోసం సంప్రదించండి.
సెల్ : 99854 11364
ఆంధ్రజ్యోతి కార్యాలయం : నియర్ ఇండస్ స్కూల్, పంచిపాడు గ్రామం, కర్నూలు.
కర్నూలు : 99854 11141, 99854 02424, 99854 02544, 97036 18696, 99854 02890, 99591 77333, ఆదోని : 97036 18726, ఎమ్మిగనూరు : 78931 48646.
నంద్యాల : 99854 02121
డోన్: 94911 02749
నందికొట్కూరు : 83092 18935

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

ఓట్ల లెక్కింపు కేంద్రాలను మార్చాలి: మల్లెల


నంద్యాల ఆర్డీవోకు వినతి పత్రం ఇస్తున్న మల్లెల రాజశేఖర్

నంద్యాల, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): రానున్న ఎన్నికలకు సంబంధించి ఓట్ల లెక్కింపు కేంద్రాలను మార్చాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ నంద్యాల ఆర్డీవో మల్లికార్జున రెడ్డిని శుక్రవారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు కేంద్రాలుగా పాణ్యం సమీపంలోని శాంతిరామ్, ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాలలను జిల్లా అధికార యంత్రాంగం ఎంపిక చేసిందని, ఈ రెండు కళాశాలలు వైసీపీ నాయకులకు సంబంధించినవేనని అన్నారు. పైగా శాంతిరామ్ కళాశాలల అధినేత శాంతిరామ్ వచ్చే ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థిగా పోటీ చేయబోయే అవకాశం ఉన్నందును వారి కళాశాలల్లో ఈవీఎంలను భద్ర పరచడం, ఓట్ల లెక్కింపు వంటివి చేపడితే అవకతవకలు జరిగే అవకాశముందని తెలిపారు. వేరే ప్రాంతాలకు కేంద్రాలను మార్చాలని కోరామని తెలిపారు.

'వైసీపీవి ప్రజా వ్యతిరేక విధానాలు'


కొత్త సిద్ధేశ్వరంలో కరపత్రాలు పంచుతున్న టీడీపీ నాయకులు

జూపాడుబంగ్లా, ఫిబ్రవరి 9: ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న జగన్ ప్రభుత్వాన్ని గద్దె దించాలని రాష్ట్ర ఎస్సీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ జయసూర్య, మండల కన్వీనర్ వెంకటేశ్వర్లు యాదవ్ అన్నారు. మండలంలోని పారుమంచాల మజారా కొత్త సిద్ధేశ్వరం గ్రామంలో శుక్రవారం బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం టీడీపీ ఆధ్వర్యంలో నిర్వహించారు. చంద్రబాబు ప్రకటించిన ఎన్నికల మినీ మేనిఫెస్టోను ఇంటింటికి వెళ్లి కరపత్రాల ద్వారా అందజేశారు.. చంద్రబాబును గెలిపిస్తే పేద, మధ్యతరగతి కుటుంబాలకు, రైతులకు గిట్టుబాటు ధరతోపాటు, నిత్యావసర సరుకుల ధరలు తగ్గుతాయని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సురేంద్రనాథ్‌రెడ్డి, రమణ, నాగేష్, సుబ్బరాయుడు, జమ్మలయ్య, రాంబాబు, శంకర్ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

పగిడ్యాల, ఫిబ్రవరి 9 : మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ జీవీ నాగేశ్వరరావు శుక్రవారం తనిఖీ చేశారు. ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లోని వసతులపై ఆరా తీశారు. కేంద్రాల్లో విద్యుత్, వికలాంగులు, వృద్ధుల కోసం ఏర్పాటు చేసిన ర్యాంపు, మంచినీటి వసతి తదితర వాటిపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మురళీ, వీఆర్వోలు ఉన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి

ఆత్మకూరు, ఫిబ్రవరి 9: ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే గర్భిణులు, బాలింతలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని మున్సిపల్ చైర్మన్ డాక్టర్ మారూఫ్ ఆసియా అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆమె ప్రభుత్వ వైద్యశాలలో గర్భిణులకు అందుతున్న వైద్య పరీక్షలను పరిశీలించారు. ముందుగా ఆసుపత్రి రికార్డులను పరిశీలించి సిబ్బంది పనితీరు గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఆసుపత్రిలోని కంటి వైద్య కేంద్రాన్ని, నవజాత శిశు కేంద్రాన్ని సందర్శించి ఆయా కేంద్రాల నిర్వహణపై ఆరా తీశారు. ఈమె వెంట మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, ఆసుపత్రి సూపరిన్‌డెంట్ డాక్టర్ రాయుడు ఉన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు

మహానంది, ఫిబ్రవరి 9: గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపట్టామని శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. శుక్రవారం మహానంది మండలం గాజులపల్లి, ఎం.తిమ్మాపురం, ఇబొల్లవరం గ్రామాలో సీసీ రోడ్లు, డ్రైనేజీ, అంగన్‌వాడీ కేంద్రాలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో నియోజకవర్గం సమన్వయకర్త శిల్పా భువనేశ్వరరెడ్డి, ఎంపీపీ యశస్వినిరెడ్డి, జడ్పీటీసీ కేవీఆర్ మహేశ్వరరెడ్డి, మహానంది దేవస్థానం పాలక మండలి మాజీ చైర్మన్ కొమ్మా మహేశ్వరరెడ్డి, సీడీపీఓ లీలావతి, ఎంపీడీఓ శివనాగజ్యోతి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కవిత పాల్గొన్నారు.

విద్యార్థులు హాజరయ్యేలా చూసుకోవాలి

గడివేముల, ఫిబ్రవరి 9: విద్యార్థులు ప్రతి రోజూ పాఠశాలకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని ఎంఈవో విమలా వసుంధరాదేవి ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. శుక్రవారం ఆమె మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బడిబయట ఉండే పిల్లలను గుర్తించాలని అన్నారు. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయాలని అన్నారు.

సమస్యలపై చర్చ

పాములపాడు, ఫిబ్రవరి 9 : మండలంలోని గ్రామ సచివాలయాల్లోని వివిధ అంశాలపై సిబ్బందితో ఎంపీడీవో సరస్వతి చర్చించారు. శుక్రవారం మిట్టకందాల, మద్దూరు గ్రామ పంచాయతీలలో సమావేశం నిర్వహించారు. పేదలకు ఇళ్ల స్థలాలకు సంబధించిన రిజిష్టర్ పత్రాలు, కులగణన, ఆయుష్మాన్ భారత్ కార్డుల పంపిణీ, గ్రామాలలో త్రాగునీటి ఎద్దడి తదితర అంశాలపై చర్చించారు ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ఈకేవైసీ చేయించుకోవాలి

కొత్తపల్లి, ఫిబ్రవరి 9: రబీ సీజన్‌లో సాగైన పంటలకు ఈకేవైసీ తప్పని సరిగా చేయించుకోవాలని ఆత్మకూరు వ్యవసాయ సహాయ సంచాల కులు ఆంజనేయ అన్నారు. శుక్రవారం కొత్తపల్లి రైతుభరోసా కేంద్రంలో మండల వ్యవసాయాధికారి మహేష్ ఆధ్వర్యంలో మండల స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆంజనేయ మాట్లాడుతూ పీఎం కిసాన్ నిధులు త్వరలో రైతుల ఖాతాలో జమ కానున్న నేపథ్యంలో ఈకేవైసీ చేయించుకోవాలని కోరారు.

విత్తన శుద్ధిపై రైతులకు అవగాహన

పాములపాడు, ఫిబ్రవరి 9 : ట్రైకోడెర్మా విరిడీతో విత్తన శుద్ధి చేయడం వల్ల పంటలో తెగుళ్లను అరికట్టవచ్చని మండల వ్యవసాయ శాఖ అధికారి ఫణీశ్వరరెడ్డి, జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయశాఖ అధికారి హేమలత అన్నారు. శుక్రవారం వ్యవసాయ శాఖ కార్యాలయంలో సలహా మండల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో చైర్మన్ రఘురామి రెడ్డి పాల్గొన్నారు.

CHANGE OF NAME & DOB

I, 13954099 L, Rank: Naik / AA(TS), Sapuri Swamanna S/o. Late S.Yellaiah, Occupation: EX- Army, Resident of H.No:4-723, SPY Reddy Model Colony, Kranthi Nagar, nandyal town and Mandal, Nandyal District-518501. A.P., India. That in my Army service record discharge book my Wife's Name are mistakenly entered dues to over sight Now I have change My wife's name S.Jaya Lakshmi instead of Sapuri Jaya Lakshmi (Correct Name) and date of birth entered as 01-01-1971 instead of 22-06-1973 (Correct date of birth) (Aadhar No: 6835 0004 2308 Correct Name and date of birth). Hence I request to concerning Authorities please accept this Affidavit and kindly consider my name Sapuri Jaya Lakshmi and date of birth is 22-06-1973. Vide affidavit dated 08-02-2024 before advocate G.Ramprasad, Advocate & Notary, Nandyal, Nandyal District., A.P. This is for kind information of all Concerned.

మద్యం స్వాధీనం

వెలుగోడు, ఫిబ్రవరి 9 : మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని తరలిస్తున్న అక్రమంగా రవాణ చేస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ భూపాలుడు తెలిపారు. మోత్కూరు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి 21 మద్యం సీసాలను అక్రమంగా తరలిస్తున్నాడని సమాచారంతో దాడులు చేసి స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

VEHICLE FOR SALE

VEHICLE NO.	DESCRIPTION	MODEL
AP29TY-1921	ASHOK LEYLAND - 3118	2014

M/S SHRIRAM AUTOMALL INDIA LIMITED
NH-44, NEAR ALLAMPUR TOLLGATE,
PANCHALINGALA (V) KURNOOL (DT.)
CELL : 99895 00684.

ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ


విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న చేస్తున్న డాక్టర్ సునీత

ఆత్మకూరు, ఫిబ్రవరి 9: ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జాతీయ నులిపురుగుల నివారణ దినాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు జిల్లా ప్రోగ్రామ్ మానిటరింగ్ ఆఫీసర్ డాక్టర్ సునీత ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ డాక్టర్ మారూఫ్ ఆసియా, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, ఎంఈవో జానకీరామ్, అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి సాజిదా ఫిర్దోస్, బైర్లూటి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ గోపాల్ పాల్గొన్నారు.

● కొత్తపల్లి, ఫిబ్రవరి 9: విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని జిల్లా ప్రోగ్రాం పర్యవేక్షణాధికారి డా.సునీత అన్నారు. శుక్రవారం మండలంలోని దుద్యాల జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జాతీయ నులి పురుగుల నివారణ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో హెచ్‌ఎం మంగన్న, వైద్యాధికారి గోపాల్, సీహెచ్‌వో బాలకృష్ణ, సీహెచ్‌ఎస్ అయేషాబేగం, సూపర్‌వైజర్లు గుర్రప్ప, టీబీ అధికారులు చెరుకు రవికుమార్, మస్తానయ్య, హెల్త్ అసిస్టెంట్ త్రివేణి పాల్గొన్నారు.

● నందికొట్కూరు ఫిబ్రవరి 9: వ్యక్తిగత పరిశుభ్రతను పాటించి నులిపురుగుల నుంచి రక్షణ పొందుదామని బైరెడ్డినగర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు సలీం బాషా అన్నారు. శుక్రవారం జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ సెక్రటరీ విజయలక్ష్మి, ఉపాధ్యాయులు, మల్లికార్జునరెడ్డి, శారదమ్మ, లలితమ్మ, సాలమ్మ, శంషాదు బేగం, సరోజినీదేవి, వెంకటేశ్వర్లు, ఫిజికల్ డైరెక్టర్ శ్రీనాథ్ పెరుమాళ్ల, ఆశావర్కర్ లక్ష్మీదేవి పాల్గొన్నారు.

● మహానంది, ఫిబ్రవరి 9: గిరిజన విద్యార్థులు చదువుతోపాటు పరిశుభ్రతపై శ్రద్ధ తీసుకోవాలని తిమ్మాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎంపీహెచ్‌ఈఓ ఉసేన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మహానందిలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు పరిసరాల పరిశుభ్రతతోపాటు భోజనం చేసే ముందు చేతులు ఏవిధంగా శుభ్రం చేసుకోవాలనే అంశంపై అవగాహన కల్పించారు. అనంతరం ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. అంతకుముందు తిమ్మాపురం కస్తూరిబా పాఠశాల విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను అందజేశారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం హేమలత పాల్గొన్నారు.

● పగిడ్యాల, ఫిబ్రవరి 9: మండల పరిధిలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు శుక్రవారం పంపిణీ చేసినట్లు ఎంఈవో సుభాన్ తెలిపారు. పగిడ్యాలలోని ఆదర్శ పాఠశాలకు చెందిన విద్యార్థులకు ఎంపీడీవో కవిరాజ్, వైద్యాధికారులు మోహన్ ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సుజనా, ఈవోఆర్డీ నాగేంద్రమయ్య ఉన్నారు.

● ఆత్మకూరు రూరల్, ఫిబ్రవరి 9: నులి పురుగులను పూర్తిగా నిర్మూలించేందుకే ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేస్తున్నట్లు వైద్యాధికారులు పవన్‌కుమార్, గోపాల్‌నాయక్ పేర్కొన్నారు. శుక్రవారం ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌వో ఖుద్దూస్ భాష, హెల్త్ ఎడ్యుకేటర్ ధనలక్ష్మి, సూపర్‌వైజర్ మాలిక్‌బాషా పాల్గొన్నారు.

పాణ్యం, ఫిబ్రవరి 9 : జాతీయ నులిపురుగుల నివారణ దినం సందర్భంగా శుక్రవారం విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఏఆర్ కాలనీలోని ఎంపీపీ పాఠశాలలో ఎంఈఓ కోటయ్య ఆధ్వర్యంలో విద్యార్థులకు మాత్రలు మింగించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కార్యాలయ సూపరిండెంట్ నరసింహారెడ్డి, ఎంఈఓ-2 సుబ్రహ్మణ్యం, హెచ్‌ఎం మేరీ సునీత, జిలానీబాష, శ్యామల, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి



ఆత్మకూరులో డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న దృశ్యం

ఆత్మకూరు, ఫిబ్రవరి 9: ఆశా వర్కర్లు చేస్తున్న సేవలను గుర్తించి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సీఐటీయూ నాయకులు రామ్‌నాయక్, రణధీర్, ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాలు భారతి అన్నారు. శుక్రవారం స్థానిక సీపీఎం కార్యాలయం గౌడ్ సెంటర్, కొత్త బస్టాండ్ మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు వరకు ఆశా కార్యకర్తలు ర్యాలీ నిర్వహించి ధర్నా చేశారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ మనోహర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు లక్ష్మీబాయి, సులోచన, చంద్రకళ, వెంకటరమణమ్మ, సామక్క, అవర్ల, వరలక్ష్మి, శాంతి, రవిజాబీ, చంద్రకళ తదితరులు ఉన్నారు.

వెలుగోడు, ఫిబ్రవరి 9 : సమస్యలను పరిష్కరించాలంటూ శాంతియుతంగా నిరసన తెలుపుతున్న ఆశా వర్కర్లను అరెస్టు చేయడం అన్యాయమని ఆశా వర్కర్ల యూనియన్ నాయకులు వరలక్ష్మి, స్వర్ణలత, భాగ్యలక్ష్మి, అన్నారు. శుక్రవారం వెలుగోడు పట్టణంలో సీఐటీయూ నాయకులు, మరికొంత మంది నాయకులు శ్రీనివాసులు, మహమ్మద్‌రఫీలతో కలిసి తహసీల్దార్ విజయకుమారికి వినతి పత్రం అందించారు.

● గోస్పాడు, ఫిబ్రవరి 9 : ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని శుక్రవారం గోస్పాడులో ధర్నా నిర్వహించారు. ఆశా వర్కర్స్ రాష్ట్ర వర్కర్స్ యూనియన్ ఆదేశాల మేరకు మండల వర్కర్స్ యూనియన్ అధ్యక్షురాలు సుమలత ఆధ్వర్యంలో జిల్లా కార్యదర్శి రమణకుమారి గోస్పాడులో ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ రాముకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆశా వర్కర్లు హుసేనమ్మ, ఈశ్వరి, బాలమ్మ, ప్రసన్న లక్ష్మి, శివపార్వతి, మరియమ్మ, ప్రభావతి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ కోతలు

నంద్యాల రూరల్, జనవరి 9: విద్యుత్ శాఖ సాధారణ నిర్వహణ పనుల్లో భాగంగా నంద్యాల పట్టణంలో శనివారం పలు ప్రాంతాలలో విద్యుత్ కోత విధిస్తున్నట్లు విద్యుత్ ఇంజనీర్ రామయ్య శుక్రవారం తెలిపారు. పట్టణంలోని హౌసింగ్ బోర్డ్ కాలనీ, ఎన్జీఓ కాలనీ, ఎస్‌బీఐ కాలనీ, దేవనగర్, సాయిబాబ నగర్, నర్స్ క్వార్టర్స్ గూడ్స్ షెడ్, నూనెపల్లె, కడప రోడ్డు, గెల్వి ఫ్యాక్టరీ పరిసరాలు, పాల కేంద్రం, గిరినాథ్ సెంటర్, గోపాల్ నగర్, దేవనగర్, పద్మావతి నగర్, టెక్కె, సుద్దుల పేట, పాలిటెక్నిక్ కళాశాల ప్రాంతం, అక్షర డిగ్రీ కళాశాల ఏరియా, భరత మాత గుడి రోడ్డు, విశ్వనగర్, లలితానగర్, గురు రాఘవేంద్ర కోచింగ్ సెంటర్ ఏరియాలో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

డ్రోన్‌ల ప్రాముఖ్యత

పాణ్యం, ఫిబ్రవరి 9: వ్యవసాయ, మిలిటరీ రంగాలలో డ్రోన్‌ల ప్రాముఖ్యత ఎంతో ఉందని ఇండియా డ్రోన్ అకాడమీ డైరెక్టర్ వంశీకృష్ణ అన్నారు. మండలంలోని శాంతిరాం ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం పరిశ్రమల వ్యవస్థాపనలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సుబ్రహ్మణ్యం, హెచ్‌ఓడీ డాక్టర్ మల్లికార్జునరావు, కార్యదర్శి అలేఖ్యా హిమబిందు పాల్గొన్నారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

నంద్యాల (కల్చరల్), ఫిబ్రవరి 9: నంద్యాల ఆయుష్ యోగా కేంద్రంలో ఆదివారం ఉదయం 10 గంటలకు శాంతిరాం హాస్పిటల్ వారి సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆయుష్ యోగా కేంద్రం నిర్వాహకులు ఇండే ఆనంద్‌గురూజీ తెలిపారు. ఎంపీ పోచా బ్రహ్మానంద రెడ్డి, ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్‌రెడ్డి, డాక్టర్ గెలివి సహదేవుడు, డాక్టర్ చిత్తలూరు మధుసూదనరావులు పాల్గొంటారన్నారు. వైద్య శిబిరంలో బీపీ, షుగర్, గుండె, కిడ్నీ, కంటి, కీళ్ల పరీక్షలు చేస్తారని చెప్పారు.

మెనూ పాటించాలి

పగిడ్యాల, ఫిబ్రవరి 9 : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని ఎంఈవో సుభాన్ అన్నారు. స్థానిక ఎమ్మార్సీ భవనంలో ప్రధానోపాధ్యాయులకు మధ్యాహ్న భోజనం పథకంపై శుక్రవారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవో-2 మురళీమోహన్ పాల్గొన్నారు.

ఎస్ఐగా పి.వెంకటరమణ

నందికొట్కూరు ఫిబ్రవరి 9: నందికొట్కూరు పట్టణ ఎస్ఐగా పి.వెంకటరమణ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన అన్నమయ్య జిల్లా రాజంపేటలో విధులు నిర్వహిస్తూ నందికొట్కూరు బదిలీ అయ్యారు. దీంతో ఆయన శుక్రవారం బాధ్యతలు చేపట్టారు.

బాబుతోనే భవిష్యత్తుకు


కరపత్రం పంచుతున్న బుడ్డా రాజశేఖర్‌రెడ్డి

శ్రీశైలం, ఫిబ్రవరి 9: టీడీపీ ప్రభుత్వం వస్తేనే ప్రజల భవిష్యత్తుకు గ్యారెంటీ అని శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి అన్నారు. శుక్రవారం సుండిపెంట రిక్షా కాలనీలో బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి ప్రజలు పడుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఖాతా రామిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, బ్రహ్మానందరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, రామలింగారెడ్డి, బెంజిమెన్, యుగంధర్‌రెడ్డి, రమణ ఉన్నారు.

మార్చి 9న జాతీయ లోక్ అదాలత్

● సీనియర్ సివిల్ న్యాయాధికారి ఇందిరా ప్రియదర్శిని


మాట్లాడుతున్న సీనియర్ సివిల్ న్యాయాధికారి

నందికొట్కూరు ఫిబ్రవరి 9: మార్చి 9వ తేదీన జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో పెండింగ్‌లో ఉన్న కేసులను రాజీ మార్గం ద్వారా పరిష్కరించుకోవాలని సీనియర్ సివిల్ న్యాయాధికారి ఇందిరా ప్రియదర్శిని అన్నారు. శుక్రవారం కార్మిక వ్యవస్థ చట్టం 1976 అమలు దినం సందర్భంగా సీనియర్ సివిల్ న్యాయాధికారి ఇందిరా ప్రియదర్శిని కోర్టు ఆవరణలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కార్మిక శాఖ అధికారి కె.వెంకటేశ్వర్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, శ్యామలదేవి, పోలీసు అధికారి, అడ్వకేట్, స్వచ్ఛంద సంస్థ మెంబరు నాగన్న సోషల్ వర్కర్ శోభారాణి పాల్గొన్నారు. సమావేశ నిర్ణయాల్లో భాగంగా బంధిత వ్యవస్థ గుర్తింపు, గుర్తించిన కార్మికులకు పునరావాసం కల్పించడం, పథకాలు అందేలా చూడడం, చట్టాలపై అవగాహన కల్పించడం, చట్టాను అమలు చేయడంలో సామాజిక బాధ్యత వహించడం, మార్చి 9వ తేదీన జాతీయ లోక్ అదాలత్‌లో తమ పెండింగ్ కేసులను రాజీ మార్గంలో పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు.

అతివేగం ప్రమాదకరం: డీఎస్పీ


రోడ్డు భద్రతా వారోత్సవాల్లో పాల్గొన్న డీఎస్పీ రవీంద్రనాథ్‌రెడ్డి

నంద్యాల క్రైం, ఫిబ్రవరి 9 : అతివేగం అత్యంత ప్రమాదకరమని నంద్యాల టౌన్ డీఎస్పీ రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ చర్యల్లో భాగంగా ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి ఆదేశాల మేరకు నంద్యాలలో శుక్రవారం ఆటో డ్రైవర్లకు రోడ్డు భద్రతా నిబంధనలు, ట్రాఫిక్ నిబంధనలపై మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రవిశంకర్‌నాయక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి డీఎస్పీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. డీఎస్పీ రవీంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ పరిమితికి మించి ఆటోల్లో ప్రయాణికులను ఎక్కించుకోరాదని, డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్, వాహనానికి సంబంధించిన రిజిస్ట్రేషన్ పత్రాలన్నీ కలిగి ఉండాలన్నారు. మోటార్‌సైకిల్‌పై ప్రయాణించేటపుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. మద్యం సేవించడం లాంటి వాటి వల్లనే ప్రమాదాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మోటార్‌వెహికల్ ఇన్‌స్పెక్టర్ రవిశంకర్‌నాయక్, ట్రాఫిక్ సీఐ ఇస్మాయిల్, ట్రాఫిక్ ఎస్సైలు, పట్టణ ఎస్సైలు, రెడ్‌క్రాస్ ప్రతినిధి దస్తగిరి పాల్గొన్నారు.

మైనార్టీలకు బీజేపీ వ్యతిరేకం కాదు

నంద్యాల (కల్చరల్), ఫిబ్రవరి 9: మైనార్టీలకు బీజేపీ వ్యతిరేకం కాదని మైనార్టీ మహిళా నాయకురాలు హసీనా అన్నారు. పల్లెకు పోదాం కార్యక్రమం భాగంగా నంద్యాల అసెంబ్లీ కన్వీనర్ అభిరుచి మధు ఆధ్వర్యంలో దాబోలు గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మైనార్టీలు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా ప్రధాని నరేంద్ర మోదీ దేశాన్ని అభివృద్ధి పథంలో తీసుకుపోతున్నారన్నారు. బీజేపీ ప్రభుత్వం చేస్తున్న పథకాలన్నింటినీ ఇంటింటికి వెళ్లి ప్రచారం చేస్తామని హసీనా పేర్కొన్నారు.

అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు

పాణ్యం, ఫిబ్రవరి : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీ అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రిన్సిపాల్ సింహాద్రి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ కళాశాలలో పొలిటికల్ సైన్స్, ఆఫీస్ మేనేజ్‌మెంట్ అండ్ సెక్రటేరియల్ ప్రాక్టీసెస్, తెలుగు సబ్జెక్టులను బోధించడానికి అర్హులైన అతిథి అధ్యాపకుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ రమేష్ 9441335805లను సంప్రదించాలన్నారు.

తల్లిదండ్రులకు పిల్లల అప్పగింత

నందికొట్కూరు ఫిబ్రవరి 9: కర్నూలులో తప్పిపోయిన ఇద్దరు చిన్నారులను నందికొట్కూరులో వారి తండ్రికి పట్టణ సీఐ ప్రకాష్ కుమార్ అప్పగించారు. గురువారం మధ్యాహ్నం నందికొట్కూరులోని ఓ సెల్‌ఫోన్ షాపు వద్ద ఇద్దరు చిన్నారులు ఉండడాన్ని కానిస్టేబుల్ ఓబులేసు గమనించి పట్టణ సీఐ ప్రకాష్ కుమార్‌కు సమాచారం ఇచ్చి స్టేషన్‌కు తీసుకెళ్లారు. చిన్నారులను వివరాలు అడగగా ఒకరి పేరు సిద్దూ, మరొకరి పేరు జెనైస్ రైనాలని తెలిపారు. తమ ఊరు బి.తాండ్రపాడు, తల్లిదండ్రుల పేర్లు కృపా కర్, నాగన్నలు అని చెప్పారు. తప్పిపోయి ఇక్కడికి వచ్చామని వివరించ డంతో సీఐ వారి తల్లిదండ్రులకు సమాచారం అందించి శుక్రవారం రాత్రి చిన్నారులను వారి తల్లిదండ్రులకు అప్పగించారు.


చిన్నారులను వారి తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పట్టణ సీఐ ప్రకాష్‌కుమార్

మహానందీశ్వరుడి పల్లకి ఉత్సవం


అత్మకూరులో ఆంజనేయ స్వామికి కరెన్సీతో అలంకరణ


మహానందిలో పల్లకి సేవ నిర్వహిస్తున్న దృశ్యం

మహానంది, ఫిబ్రవరి 9: మహానంది క్షేత్రంలో శుక్రవారం రాత్రి మహానందీశ్వరున్ని పల్లకి ఉత్సవాన్ని లయ వేదపండితులు వైభవంగా జరిపారు. ముందుగా ఆలయం ప్రాంగణంలోని అలంకార మండపంలో మహానందీశ్వర స్వామి, కామేశ్వరీదేవి అమ్మవార్ల ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా పూలతో అలంకరించిన పల్లకిపై భక్తి శ్రద్ధలతో అర్చకులు ఆశీనులను చేశారు. అనంతరం వేదమంత్రాలతో ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో భక్తుల శివనామస్మరణ మధ్య పల్లకి ఉత్సవం జరిపారు. కార్యక్రమంలో టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నాగభూషణంతో పాటు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అచల పరిపూర్ణయోగానంద పాములేటి స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం

నంద్యాల (కల్చరల్), ఫిబ్రవరి 9: నంద్యాల హౌసింగ్ బోర్డు కాలనీలో వెలసిన అమరయోగ వికాస కేంద్రంలో అచల పరిపూర్ణయోగానంద పాములేటి స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శుక్రవారం పద్మశేఖర్, యోగానంద ఆధ్వర్యంలో పాములేటి స్వామి విగ్రహానికి జలాధివాసం,, ధాన్యాధివాసం, యంత్ర ప్రతిష్ఠ, ప్రత్యేక అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి ఎన్ఎండీ ఫరూక్, దామోదర్‌రెడ్డి పాల్గొన్నారు.

నగరేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు

నంద్యాల వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో శుక్రవారం ఉదయం వాసవీ మహిళా మండలి ఆధ్వర్యంలో వాస వీ మాతకు క్షీరాభిషేకం నిర్వహించారు. వాసవీ మాత ఆత్మార్పణ దినోత్సవంలో భాగంగా నగరేశ్వర స్వామికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో వాసవీ మహిళా మండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

అభయాంజనేయ స్వామికి అమావాస్య పూజలు

ఆత్మకూరు: ఆత్మకూరు పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలో గల ఆత్మలింగేశ్వర స్వామి ఆలయం వద్ద వెలసిన అభయాంజనేయ స్వామికి అర్చకులు అనిల్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో శుక్రవారం అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగానే ప్రాతఃకాల సమయంలో స్వామివారికి పంచామృతాభిషేకాలు జరిపి శాస్త్రోక్తంగా పూజా క్రతువులను చేపట్టారు. అలాగే భజన కార్యక్రమాలు, సామూహిక కుంకుమార్చనలతో పాటు ధూప, నక్షత్ర హారతులను నివేదించారు. అర్ధరాత్రి 12 గంటలకు మహా మంగళహారతి సమర్పించారు. అమావాస్య సందర్భంగా కరెన్సీ నోట్లతో స్వామివారిని అలంకరించారు. స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు తరలి వచ్చారు. విచ్చేసిన భక్తులకు ఆలయ కమిటీ వారు తీర్థప్రసాదాలను వితరణ చేశారు.

ఎర్రగూడూరులో...

పాములపాడు: ఎర్రగూడూరు శివార్లలోని సంజీవ అభయాంజనేయస్వామికి చొళంగి అమావాస్యను పురస్కరించుకొని ఆలయ పురోహితులు జ్వాలముఖి రాఘవశర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం స్వామి వారికి అభిషేకం, అర్చన, ఆకుపూజలు నిర్వహించి వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. ఈ సందర్భంగా పురోహితులు మాట్లాడుతూ ఈ రోజు స్వామి వారిని దర్శించుకోవడం వల్ల భక్తులకు దారిద్ర్యం తొలగిపోయి సుఖ సంతోషాలతో జీవిస్తారని తెలిపారు. సాయంత్రం విశేష హారతులు, పల్లకిసేవ, భజనలు నిర్వహించారు.

ఆధ్యాత్మిక విద్యను నేర్చుకోవాలి

నందికొట్కూరు ఫిబ్రవరి 9: విద్యార్థి దశ నుంచే ఆధ్యాత్మిక విలువలతో కూడిన విద్యను నేర్చుకోవాలని నారదముని భక్త బృందం ఇస్కాన్ ప్రతినిధి కీర్తిరాజ్ అన్నారు. శుక్రవారం నారదముని భక్త బృందం ఆధ్వర్యంలో పట్టణంలోని స్కాలర్ ఉన్నత పాఠశాలలో భగవద్గీత యథార్థతం ప్రవచనం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రవచనంలో భాగంగా భగవద్గీత ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు.

రాష్ట్రాన్ని దివాలా తీయించడానికి వైసీపీ సిద్ధం: ధర్మవరం సుబ్బారెడ్డి


బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్న సుబ్బారెడ్డి

బేతంచెర్ల, ఫిబ్రవరి 9: రాష్ట్రాన్ని దివాలా తీయించడానికి వైసీపీ ప్రభుత్వం సిద్ధంగా ఉందని, పేదల నడ్డి విరుస్తూ పైశాచిక ఆనందం పొందుతున్న సైకో సీఎం జగన్ పాలనకు ప్రజలు చరమగీతం పాడడానికి సంసిద్ధంగా ఉన్నారని డోన్ టీడీపీ ఇన్‌చార్జి ధర్మవరం సుబ్బారెడ్డి అన్నారు. శుక్రవారం సాయంత్రం నగర పంచాయతీ పరిధిలోని 8వ వార్డులో టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్షావలి చౌదరి ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ -భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన సుబ్బారెడ్డి మాట్లాడుతూ సీఎం జగన్ తాను సిద్ధం అంటున్నారు. దేనికి? రాష్ట్రాన్ని దివాలా తీయించడానికేనా? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నిత్యావసర వస్తువుల ధరలు పెంచి నిత్యం దళిత గిరిజన మైనార్టీ వర్గాలను లక్ష్యంగా చేసుకుని వారిపై దాడులు చేయిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో నంద్యాల పార్లమెంటు ఉపాధ్యక్షుడు వెంకటేశ్వరరెడ్డి, డోన్ టీసీ సెల్ అధ్యక్షుడు నాయుడు, బేతంచెర్ల మండల కన్వీనర్ ఎల్లనా గయ్య, సీనియర్ నాయకులు రామిరెడ్డి, చంద్రశేఖర్, సుధాకర్, రమేష్, మైనార్టీ నాయకులు జాకీరుల్లాబేగ్, ఎస్టీ సెల్ కార్యదర్శి రవీంద్ర నాయక్, క్రిస్టియన్ కమిటీ కార్యదర్శి మేకల నాగరాజు, ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి రూబెన్, నారాయణస్వామి, టీడీపీ కౌన్సిలర్స్ రామాంజనేయులు, రామగోపాల్, రామ్మూర్తి, నంద్యాల మధు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.25వేల విరాళం


బుక్కాపురం గ్రామస్థులకు విరాళం అందజేస్తున్న గౌతమ్ రెడ్డి

డోన్, ఫిబ్రవరి 9: పట్టణంలోని టీడీపీ డోన్ ఇన్‌చార్జి ధర్మవరం సుబ్బారెడ్డి నివాసంలో టీడీపీ నాయకుడు ధర్మవరం గౌతమ్ రెడ్డి శుక్రవారం రూ.25వేల విరాళం అందజేశారు. బేతంచెర్ల మండలం బుక్కాపురం గ్రామంలో సీతారాముల ఆలయ నిర్మాణానికి విరాళాన్ని గ్రామస్థులకు అందజేశారు. గౌతమ్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో సేవా కార్యక్రమాలకు ఎల్లప్పుడు తమ వంతు సహకారాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో బుక్కాపురం గ్రామస్థులు లక్ష్మన్న, కృష్ణుడు, శేఖర్, మల్లికార్జున పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయురాలికి సత్కారం

బనగానపల్లె, ఫిబ్రవరి 9: బనగానపల్లె పట్టణంలోని బాలికోన్నత పాఠశాలలో ఫిజిక్స్ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న షాహినాజ్‌బేగం రాష్ట్ర స్థాయిలో ఉత్తమ అవార్డు అందుకోవడంతో ఆమెను శుక్రవారం పాఠశాలలో హెచ్‌ఎం గంగాధర్‌రెడ్డితో పాటు ఉపాధ్యాయులు, మహిళా ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. జిల్లా ఆటోమేటిక్ హ్యాండ్ శ్యానిటైజర్ డిస్పెన్సర్ అను ప్రాజెక్టును జిల్లా, రాష్ట్రస్థాయిలో ప్రదర్శించారన్నారు. దక్షిణ భారతదేశంలో విజయవాడలో నిర్వహించిన సైన్సుపేర్‌లో తన ప్రాజెక్టును ప్రదర్శించి భారత్ ఎలక్ట్రానిక్ తరఫున ప్రథమ బహుమతి అందుకొని ప్రతిభ చాటారు. అలాగే బనగానపల్లె బాలికోన్నత పాఠశాలలో హెచ్‌ఎం బాలగంగాధర‌రెడ్డితో పాటు, ఉపాధ్యాయులు, మహిళా ఉపాధ్యాయులు సత్కరించి భవిష్యత్‌లో మరింత ప్రతిభ కనబరచి దేశస్థాయి బహుమతులు సంపాదించి పాఠశాలకు పేరు తేవాలని ఆకాంక్షించారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

డోన్(రూరల్), ఫిబ్రవరి 9: మండలంలోని గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా నివారణ చర్యలు తీసుకుంటున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సతీష్ అన్నారు. శనివారం ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ మండలంలోని వెంకటనాయునిపల్లె గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం గోసానిపల్లె గ్రామం నుంచి పైపులైన్లు మండల నిధుల తో జరుగుతున్నాయని అన్నారు. అలాగే కొచ్చెర్వు గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం ప్రత్యేక ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సీపీడబ్ల్యూఎస్ స్కీం కింద ప్యాపిలి నుంచి డోన్ మండలం కొత్తబురుజు, కొత్రాయి గ్రామాలకు తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు.

ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

డోన్(రూరల్), ఫిబ్రవరి 9: అక్రిడేషన్‌తో సంబంధం లేకుండా సంస్థ గుర్తింపు కార్డు ఉన్న జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఏపీ మీడియా ఫెడరేషన్ తాలుకా అధ్యక్షుడు నాగరాజు, గౌరవ సలహాదారులు ముత్యాల శివరామాచారి డిమాండ్ చేశారు. శుక్రవారం ఏపీఎంఎస్ కార్యాలయం నుంచి ర్యాలీగా వెళ్లి డోన్ ఆర్డీవో మహేశ్వరరెడ్డికి జర్నలిస్టులు వినతి పత్రం అందజేశారు.

రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

కొలిమిగుండ్ల, ఫిబ్రవరి 9: స్థానిక జ్యోతి విద్యానికేతన్ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి సూపర్‌సైనిక్ క్రికెట్ పోటీలకు ఎంపికైనట్లు కరస్పాండెంట్ నవితానాథ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సింధూరి శుక్రవారం తెలిపారు. వారు విలేకరులతో మాట్లాడుతూ పాఠశాలకు చెందిన కార్తీక్‌రెడ్డి, రాకేశ్‌రెడ్డి, నితిన్‌రెడ్డి జిల్లా క్రికెట్ జట్టు నుంచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక య్యారన్నారు. ప్రతిభ కనబరచిన విద్యార్థులను వారు అభినందించారు. వ్యాయామ ఉపాధ్యాయులు పరమేశ్వర్‌రెడ్డి, సురేశ్‌పార్వతి, శృతి పాల్గొన్నారు.

నేడు బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ

కొలిమిగుండ్ల, ఫిబ్రవరి 9: మండలంలోని గోర్విమానుపల్లె గ్రామంలో శనివారం బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల టీడీపీ కన్వీనర్ మూలే రామేశ్వర్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. ఈకార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి హాజరవుతున్నారన్నారు. మండలంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు.

టీడీపీ నాయకుడి మృతికి సంతాపం

చాగలమర్రి, ఫిబ్రవరి 9: చాగలమర్రిలోని కొత్త ఎస్సీ కాలనీలో టీడీపీ నాయకుడు కె.జీవన్న అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న టీడీపీ బీసీ సెల్ నంద్యాల స్పోక్‌పర్సన్ నల్లా నాగ రాజు, టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి గుత్తి నరసింహులు మృతదేహంపై పూలమాల వేసి సంతాపం ప్రకటించారు. వారి వెంట టీడీపీ నాయకులు టైలర్ బాష, చోటు, మోహన్ ఉన్నారు.

జర్నలిస్టు మృతికి..

డోన్, ఫిబ్రవరి 9: డోన్ పట్టణంలో ఓ చానల్‌లో జర్నలిస్టుగా పని చేస్తున్న మధు మృతికి శుక్రవారం జర్నలిస్టు సంఘాల నాయకులు సంతాపం తెలిపారు. ఏపీయుడబ్ల్యూజే, ఏపీఎంఎస్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో మధు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఐదు నెలల క్రితం రోడ్డు ప్రమాదానికి గురై కోలుకోలేక మృతి చెందడం బాధాకరమని అసోసియేషన్ నాయకులు కరణం రమణ, విజయ మోహన్ నాయుడు అన్నారు.

అసెంబ్లీ ఎదుట సెల్ఫీ తీసుకొని దాచుకోండి

- వైసీపీకి ఇవే చివరి ఎన్నికలు
- మాజీ మంత్రి భూమా అఖిలప్రియ


మాట్లాడుతున్న భూమా అఖిలప్రియ

శిరివెళ్ల, ఫిబ్రవరి 9: రాష్ట్రంలోని ఎమ్మెల్యేలు, మంత్రులు అసెంబ్లీ ఎదుట సెల్ఫీ తీసుకొని దాచుకోవాలని, వైసీపీకి ఇవే చివరి ఎన్నికలని టీడీపీ మాజీ మంత్రి భూమా అఖిలప్రియ అన్నారు. బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీలో భాగంగా మండలంలోని యర్రగుంట్ల గ్రామంలో శుక్రవారం పర్యటించి టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజలకు అందించబోయే సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో పరిపాలన కుంటుపడిందని అన్నారు. ప్రజల అండతో గెలుపొంది వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాల్సిన ఎమ్మెల్యేలు ఓటమి భయంతో అసెంబ్లీలోకి సైతం అడుగు పెట్టలేక పోవడంతో ఏకంగా అసెంబ్లీని వాయిదా వేయాల్సిన దుస్థితి నెలకొందని అన్నారు. ఆళ్లగడ్డ ఎమ్మెల్యే అసెంబ్లీలో ఏ ప్రజా సమస్యలపై మాట్లాడారో, నియోజకవర్గ అభివృద్ధికి ఏం కృషి చేశారో ప్రజలకు తెలియాలని అన్నారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో గ్రామాల్లో హడావుడిగా రోడ్లు వేసి భారీ ఎత్తున శిలాఫలకాలు ఏర్పాటు చేసుకుంటున్నారని అన్నారు. వైసీపీ ప్రజాప్రతినిధులు అధికార బలంతో ప్రజలకు చేసిన అన్యాయాలు, కబ్జాలు, దౌర్జన్యాలను గుర్తు పెట్టుకుంటారని అన్నారు. రాష్ట్రాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసుకోవాలంటే టీడీపీ అధికారంలోకి రావాలని అన్నారు. కార్యక్రమంలో కాటంరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, కమతం జయరామిరెడ్డి, కమతం లక్ష్మిరెడ్డి, పుల్లా రెడ్డి, నత్తారు లక్ష్మిరెడ్డి, సుబ్బారెడ్డి, మురళీ, శీలం లక్ష్మిప్రసాదు, తాళ్లూరి బుగ్గన్న, యామా గుర్రప్ప, సూరా రాము, బాలచంద్రుడు, రవి, రామ్మోహన్, శ్రీరాములు, ఉల్లి వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడి మృతికి బీసీ సంతాపం


మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లె, ఫిబ్రవరి 9: మండలంలోని మీరాపురం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు యామసాని నాగిరెడ్డి అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. శుక్రవారం మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి వారి కుటుంబ సభ్యుల ను పరామర్శించారు. నాగిరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. బీసీ వెంట టీడీపీ నాయకులు బత్తుల బాలిరెడ్డి, బత్తుల భాస్కర్‌రెడ్డి, ఆర్‌సీ నాగిరెడ్డి, నారాయణరెడ్డి ఉన్నారు.

ఉత్సవ పల్లకికి పూజలు


ఎస్.లింగందిన్నెలో పూజలందుకుంటున్న ఉత్సవ పల్లకి

ఆళ్లగడ్డ, ఫిబ్రవరి 9: ఆళ్లగడ్డ మండలంలోని ఎస్.లింగందిన్నెలో అహోబిలం లక్ష్మీనరసింహ స్వామి ఉత్సవ పల్లకి ప్రజలచే పూజలందుకుంది. ఆళ్లగడ్డ పట్టణంలో పర్యటన ముగించుకొని ఉత్సవ పల్లకి శుక్రవారం ఎస్.లింగందిన్నె గ్రామానికి చేరుకోవడంతో గ్రామ పెద్దలు పల్లకికి మేళతాళాలతో ఘన స్వాగతం పలికారు. పల్లకి గ్రామంలోని తెలువుల వద్ద విడిది చేయడంతో ప్రజలు పల్లకిలోని జ్వాలా నరసింహ స్వామికి, ప్రహ్లాద వరద స్వామికి పూజలు చేశారు.

చౌడేశ్వరీమాతకు పల్లకీసేవ

బనగానపల్లె, ఫిబ్రవరి 9: బనగానపల్లె మండలంలోని నందవరం చౌడేశ్వరీమాత ఆలయంలో శుక్రవారం పల్లకీసేవ నిర్వహించారు. ఆలయ ఈవో రామానుజన్, పూజారుల ఆధ్వర్యంలో అమ్మవారిని పల్లకీలో అమ్మవారిని ఊరేగించారు.

నులిపురుగులతో రక్తహీనత

శిరివెళ్ల, ఫిబ్రవరి 9: నులి పురుగులతోనే చిన్నారులు రక్తహీనతకు గురవుతారని శిరివెళ్ల పీహెచ్‌సీ వైద్యురాలు దివ్య, సీహెచ్‌వో రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మండలంలోని 96 శాతం మంది విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను శుక్రవారం పంపిణీ చేశామన్నారు. పాఠశాలకు హాజరుకాని, బడి బయట పిల్లలను గుర్తించి ఈ నెల 16వ తేదీన ఆల్బెండజోల్ మాత్రలు అందిస్తామన్నారు.

రుద్రవరం: పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు తినిపించి నులి పురుగులను నులిమేద్దామని వైద్యాధికారి బాబు అన్నారు. శుక్రవారం నరసాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని 1653 మంది విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు తినిపించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో ప్రసాద్, హెల్త్ సూపర్‌వైజరు భూలక్ష్మి, ఎఎన్‌ఎం రామతులసమ్మ పాల్గొన్నారు.

- మండలంలోని ఆలమూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 5774 మంది విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసినట్లు వైద్యాధికారులు గాయత్రి, అమర్‌నాథరెడ్డిలు శుక్రవారం తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, ప్రైవేటు పాఠశాలలు విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశామన్నారు. ఈ మాత్రలు తినడం వల్ల విద్యార్థులకు నీరసం లేకుండా ఉత్సాహంగా ఉంటారన్నారు. చిత్రరేణిపల్లె గ్రామంలో పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ: నులిపురుగుల నివారణకే ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్నామని వైద్యాధికారి వెంకటసుబ్బయ్య తెలిపారు. శుక్రవారం ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ దస్తగిరి పాల్గొన్నారు.

చాగలమర్రి: నులిపురుగుల నిర్మూలనతోనే పిల్లలకు ఆరోగ్యం చేకూరుతుందని వైద్యులు ఇమ్రాన్, సూపర్‌వైజర్ రామలింగారెడ్డి అన్నారు. శుక్రవారం జాతీయ నులిపురుగుల దినం సందర్భంగా బాలుర, బాలికల పాఠశాలల్లో విద్యార్థులకు ఆల్బెండజోల్ గుళికలను మింగించారు. వారు మాట్లాడుతూ పది వేల మంది విద్యార్థులకు ఆల్బెండజోల్ గుళికలను అందజేశామని అన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఈ వెంకటమ్మ, సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.


రుద్రవరం మండలం ఆలమూరులో ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న వైద్యాధికారి అమర్‌నాథరెడ్డి

బనగానపల్లె: మండలంలోని టంగుటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని టంగుటూరు ఉన్నతపాఠశాల, ఎంపీపీ పాఠశాల, క్రైప, అప్పలాపురం గ్రామాల్లోని ఎంపీపీ స్కూల్‌లో నులిపురుగు వ్యాధి నిర్మూలనకు ఆల్బెండజోల్ మాత్రలు టంగుటూరు వైద్యాధికారి డాక్టర్ శివశంకరుడు శుక్రవారం పంపిణీ చేశారు. డాక్టర్ శివశంకరుడు డాక్టర్ సొహెల్‌బాబు మాట్లాడుతూ 19 ఏళ్లలోపు పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశామన్నారు.

బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలి


మాట్లాడుతున్న ఎంఈవో న్యామతుల్ల

చాగలమర్రి, ఫిబ్రవరి 9: బడిఈడు పిల్లలను బడిలో చేర్పించి విద్యాభివృద్ధికి కృషి చేయాలని ఎంఈవోలు అనూరాధ, న్యామతుల్ల సూచించారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో సూర్యనారాయణరెడ్డి అధ్యక్షతన హెచ్‌ఎంల సమావేశం నిర్వహించారు. వంద శాతం జీఈఆర్ సర్వేను పూర్తి చేయాలని అన్నారు. బడిబయటి పిల్లలను బడిలో చేర్పించేందుకు కృషి చేయాలని అన్నారు.

రుద్రవరం: బడి బయట పిల్లలను పాఠశాలలో చేర్పించాలని ఎంఈవో-2 లక్ష్మి అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో వెల్ఫేర్ అసిస్టెంట్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో ఆమె మాట్లాడుతూ జీఈఆర్ సర్వేలో భాగంగా వంద శాతం బడి బయట పిల్లలను బడిలో చేర్పించాం. ఎక్కడైనా పిల్లలు మిగిలి ఉంటే బడి బయట పిల్లలు తిరుగుతుంటే బడిలో చేర్పించాల్సిన బాధ్యత వెల్ఫేర్ అసిస్టెంట్లపై ఉందన్నారు. కార్యక్రమంలో ఏవో వరలక్ష్మి పాల్గొన్నారు.

యాప్‌పై అవగాహన: పాఠశాలలకు వచ్చే సరుకులను రిసీవ్ చేసుకోవడం యాప్‌పై ఎంఈఓ-2 లక్ష్మి ఉపాధ్యాయులకు వివరించారు. నెలకు నాలుగు సార్లు మధ్యాహ్న భోజనానికి సంబంధించిన రాగిపిండి, చిక్కీ, ఇంకా పలు రకాల సరుకులు తీసుకోవడానికి ఎలా తీసుకోవాలన్న అంశంపై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీఆర్పీ రామయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రోడ్డు భద్రతా వారోత్సవాలు



కోవెలకుంట్లలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్టీసీ డీఎం, సిబ్బంది

కోవెలకుంట్ల, ఫిబ్రవరి 9: కోవెలకుంట్ల పట్టణంలో శుక్రవారం ఆర్టీసీ డిపో మేనేజరు తిరుపతయ్య ట్రాఫిక్ సూపర్‌వైజర్లు, డ్రైవర్లు, కండక్టర్లు, యూనియన్ నాయకులు, సెక్యూరిటీ సిబ్బందితో కలసి రోడ్డు భద్రతా వారోత్సవాల సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. డిపో పరిధిలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

ఆళ్లగడ్డ: రోడ్డు ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పట్టణ ఎస్‌ఐ వెంకటరెడ్డి, ఆర్టీసీ డీఎం రాజశేఖరరెడ్డి ప్రజ్ఞ కళాశాల విద్యార్థులకు శుక్రవారం అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాద నివారణ మాసోత్సవాలలో భాగంగా ప్రజ్ఞ కళాశాలలోని విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రహదారిలో వెళ్లేటపుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో ప్రజ్ఞ కళాశాల నుంచి నాల్గు రోడ్ల కూడలి వరకు ర్యాలీ చేపట్టారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

ఉయ్యాలవాడ, ఫిబ్రవరి 9: మండలంలోని ఆయా గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను తహసీల్దారు వెంకటరమణ, ఎస్‌ఐ రామాంజనేయరెడ్డి పరిశీలించారు. శుక్రవారం ఒంజేడు, సర్వాయిపల్లె, ఆర్.జంబులదిన్నె గ్రామాల్లో పర్యటించారు. వీటిలో విద్యుత్, ఫ్యాన్లు, సరియైన వసతులు ఉన్నాయా లేవా అన్న అంశాలను పరిశీలించి చర్యలు చేపడతామన్నారు. వీఆర్వోలు వేణుగోపాల్, దస్తగిరి, ఎమ్మెస్కేలు పాల్గొన్నారు.

చాగలమర్రి: మండలంలోని ముత్యాలపాడు, గొడిగనూరు, శెట్టివీడు గ్రామాల్లోగల పోలింగ్ కేంద్రాలను, సచివాలయాలను ఎంపీడీవో సూర్యనారాయణరెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఆయా పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్, మరుగుదొడ్లు, భవనాల పైకప్పు, ర్యాంపులను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో వసతులపై దృష్టి సారించాలని సెక్టోరల్ అధికారులకు సూచించారు. 52 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, వాటిలో మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు. ఆయన వెంట పీఆర్వో ప్రసాదురెడ్డి, కార్యదర్శులు దస్తగిరి, దాసు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

బేతంచెర్ల, ఫిబ్రవరి 9: ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆశా వర్కర్ల యూనియన్ మండల ప్రధాన కార్యదర్శి వెంకటలక్ష్మి, మండల కమిటీ సభ్యులు పుష్పావతి, అంజినమ్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయానికి ఆశా వర్కర్లు బృందంగా వెళ్లి మండల తహసీల్దార్ జీవన్ చంద్రశేఖర్‌కు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు.

నీటి సమస్య పరిష్కారానికి చర్యలు

చాగలమర్రి, ఫిబ్రవరి 9: మండలంలోని చిన్నవంగలి గ్రామంలో మంచి నీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మురళీధర్‌రావు, ఏఈ జగ్గయ్య అన్నారు. కలుషిత నీరు అన్న శీర్షికన ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితం కావడంతో శుక్రవారం డీఈ, ఏఈలు స్పందించారు. గ్రామాన్ని సందర్శించి కొళాయిల ద్వారా వచ్చే నీటిని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బోర్లలో నీటి మట్టం తగ్గిపోవడం నీరు రంగు మారిందని అన్నారు. బోర్లలో అదనపు పైపులు వేయించి సమస్య పరిష్కరిస్తామని చెప్పారు. సింగిల్‌ఫేస్ మోటార్ ద్వారా కొళాయిలకు నీటి సరఫరా కల్పిస్తామని వివరించారు. శెట్టివీడు, డి.కొత్తపల్లె, చిన్నబోదనం, మల్లేవేముల గ్రామాల్లో కూడా తాగునీటి సమస్య నెలకొందని, వాటిపై ప్రత్యేక దృష్టి సారించామని అన్నారు. వారి వెంట కార్యదర్శి నాగార్జున, ఇంజనీరింగ్ అసిస్టెంట్ అనిల్‌కుమార్, బాబురావు ఉన్నారు.

ఎల్ఐసీ ప్రీమియంలపై జీఎస్టీ రద్దు చేయాలి

బనగానపల్లె, ఫిబ్రవరి 9: ఎల్‌ఐసీ ప్రీమియంలపై జీఎస్టీ రద్దు చేయాలని ఎల్‌ఐసీ ఉద్యోగుల సంఘం బ్రాంచి కార్యదర్శి చినరామకృష్ణుడు ఆధ్వర్యంలో బనగానపల్లె ఎల్‌ఐసీ కార్యాలయం ఎదుట శుక్రవారం నిరసన తెలిపారు. రైతులకు శాస్త్రీయమైన మద్దతు ధర, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు, కార్మికులకు కనీస వేతనాలు, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ, ఎల్‌ఐసీలో నూతన నియామకాలు చేపట్టాలని నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బ్రాంచ్ అధ్యక్షుడు సత్యనారాయణ, ప్రతాప్, రెడ్డి, ఓబులేసు, రమేశ్, నాగేశ్వరరావు, కుమారి, చంద్రబాబు, వేణుగోపాల్, ఖాశీం తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చేయండి

రుద్రవరం, ఫిబ్రవరి 9: గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని ఎంపీడీవో రామచంద్ర అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో ఎప్పటికప్పుడు పైపులైన్లను మరమ్మతులు చేయించి రక్షిత మంచినీరు ప్రజలకు అందించాలన్నారు. వాటర్ ట్యాంకులను క్లోరినేషన్ చేయించాలన్నారు. నీటి ఎద్దడి ఉంటే అప్రమత్తమై నీటి సమస్యను లేకుండా ప్రజలకు అందించాలన్నారు. ప్రజల నుంచి ఫిర్యాదులు రాకుండా చూడాలన్నారు.

భూ ఆక్రమణల తొలగింపు


ఎక్స్‌కవేటర్‌తో ఆక్రమణలను తొలగిస్తున్న రెవెన్యూ సిబ్బంది

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

బనగానపల్లె, ఫిబ్రవరి 9: బనగానపల్లెలో భూ బకాసురులు అన్న వార్తకు ఎస్సార్బీసీ, రెవెన్యూ అధికారులు సిబ్బంది శుక్రవారం స్పందించారు. బనగానపల్లె పట్టణంలోని ఎస్సార్బీసీ కాల్వ పక్కన ఉన్న హైకోర్టు ఆదేశాలను బేఖాతర్ చేస్తూ బఫర్‌జోన్‌లో కొందరు ఆక్రమణకు పూనుకున్నారని ఆంధ్రజ్యోతిలో శుక్రవారం కథనం అచ్చయిన విషయం తెలిసిందే. దీనికి స్పందించిన బనగానపల్లె తహసీల్దారు రవీంద్రారెడ్డి, ఆర్‌ఐ రాఘవేంద్ర, ఎస్సార్బీసీ ఈఈలు, ఏఈలు, బనగానపల్లె ఎస్‌ఐ రామిరెడ్డి, రెవిన్యూ, పోలీస్ సిబ్బంది బఫర్ జోన్‌లో కోర్టుకు విరుద్ధంగా వేసుకున్న బండలను తొలగించారు. పోలీసుబందోబస్తు మధ్య భూ ఆక్రమణలను తొలగించారు. ఆక్రమణలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని తహసీల్దారు రవీంద్రారెడ్డి తెలిపారు.

ప్రభుత్వ మద్దతు ధరతో జొన్న కొనుగోలు

శిరివెళ్ల, ఫిబ్రవరి 9: ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరతో రైతుల నుంచి జొన్నలను కొనుగోలు చేస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి సుధాకర్ తెలిపారు. శిరివెళ్లలోని ఏవో కార్యాలయంలో ఎంపీపీ నాయక్ మహమ్మద్ వసీం అధ్యక్షతన మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం శుక్రవారం నిర్వహించారు. రబీలో రైతులు సాగు చేసిన పంటలు నీటి ఎద్దడికి గురవకుండా కాపాడుకోవాలన్నారు.

ఆళ్లగడ్డలో శతావధానం

ఆళ్లగడ్డ, ఫిబ్రవరి 9: పట్టణంలోని రామలింగారెడ్డి కళ్యాణ మండపంలో శతావధాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల అధ్యక్షుడు అమీర్‌బాషా శుక్రవారం తెలిపారు. తెలుగు భాషా భిమానులు, తెలుగు ఉపాధ్యాయులు, సాహితి అభిమానులు పాల్గొనాలని ఆయన కోరారు. తెలుగు దనం కొత్తదనాన్ని తెలుసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని ఆదివారం వరకు కొనసాగిస్తామన్నారు.

వైభవంగా సాయి భరద్వాజ ఆత్మీయ సమ్మేళనం

చాగలమర్రి, ఫిబ్రవరి 9: చాగలమర్రిలోని సాయినాథ మందిరంలో సాయి భరద్వాజ మాస్టర్ల ఆత్మీయ సమ్మేళనం వైభవంగా నిర్వహించారు. శుక్రవారం సాయి, భరద్వాజ చిత్రపటాలతో అయ్యప్ప ఆలయం నుంచి పురవీధుల గుండా కన్యకాపరమేశ్వరి ఆలయం వరకు ఊరేగింపు నిర్వహించారు. అనంతరం సాయి మందిరంలో ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని శివరామానంద ఆశ్రమం పీఠాధిపతి అభినవ శంకరానందస్వామి జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. ఆళ్లగడ్డకు చెందిన సాయి మాస్టర్ సత్సంగ కార్యక్రమం నిర్వహించారు.

ఆంజనేయుడికి అమావాస్య పూజలు

రుద్రవరం, ఫిబ్రవరి 9: రుద్రవరంలోని పడమటి వీధిలో కొలువుదీరిన ప్రతాపరుద్ర ఆంజనేయ స్వామికి శుక్రవారం రాత్రి అమావాస్య పూజలు చేశారు. అర్చకులు వారణాసి గోపిశర్మ ఆంజనేయ స్వామిని తమలపాకులు, పూలమాలలు, నిమ్మకాయలు, తులసి మాలతో అలంకరించారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

చాగలమర్రి, ఫిబ్రవరి 9: చాగలమర్రిలోని రాయల్‌కేఫ్ సమీపంలోగల క్రీడా మైదానంలో ఫోర్‌లైన్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఎస్‌ఐ రమణయ్య, పారిశ్రామికవేత్త, దాత చక్రం టీడీ షబ్బీర్ అహ్మద్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సదర్భంగా వారు మాట్లాడుతూ మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతో అవసరం అన్నారు. ఈ పోటీల్లో 20 జట్లు పాల్గొంటున్నాయని నిర్వాహకులు తెలిపారు. విజేతలకు మొదటి బహుమతి రూ.20 వేలు దాత చక్రం టీడీ షబ్బీర్ అహ్మద్, రెండో బహుమతి రూ.10 వేలు దాతలు జమాల్, షరీఫ్, మూడో బహుమతి రూ.5 వేలు దాతలు రాయల్ కేఫ్ రఫి, నాలుగో బహుమతి రూ.3,500 దాత ముల్లా శ్యాబల్, మ్యానాఫ్ ది టోర్నమెంట్ బహుమతి రూ.3 వేలు దాత ఆకుల ఇర్షాద్ అందజేస్తారని ఆర్గనైజర్లు తెలిపారు. కార్యక్రమంలో పీడీ దాదాపీర్, ముల్లా రఫి, నిర్వాహకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

వెదురు లాట్ల పరిశీలన

రుద్రవరం, ఫిబ్రవరి 9: రుద్రవరం కలప డిపోలో శుక్రవారం సాయంత్రం జిల్లా స్క్వాడ్ బృందంలో భాగంగా డీఎఫ్‌వో రామకొండారెడ్డి, రేంజర్ శ్రీకాంత్‌లు వెదురు లాట్లను పరిశీలించారు. ఈ నెల 5న వెదురు లాట్లను వేలం నిర్వహించారు. టేప్‌తో కొలత వేసి సైజుల ప్రకారం ఉన్నాయా లేవా అని పరిశీలించారు. కార్యక్రమంలో రేంజర్ శ్రీపతినాయుడు, సిబ్బంది ఉన్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు: సీఐ

కోవెలకుంట్ల, ఫిబ్రవరి 9: ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కోవెలకుంట్ల సీఐ జయచంద్ర పేర్కొన్నారు. శుక్రవారం కోవెలకుంట్లపట్టణంలో ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న దుకాణ యజమానులను పిలిపించి వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ ప్రధాన రహదారిలో ఆర్టీసీ బస్టాండ్ నుంచి అమకు సర్కిల్ వరకు జమ్మలమడుగు సర్కిల్ నుంచి అంకాలమ్మ గుడి వరకు ఉన్న దుకాణాల ఎదుట వాహనాలు పెట్టి ట్రాఫిక్‌కు అంతరాయం కల్గిస్తున్నారన్నారు. ఎస్‌ఐ వరప్రసాద్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ వంద శాతం పూర్తి చేయాలి

రుద్రవరం, ఫిబ్రవరి 9: ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ వంద శాతం 9వ తేదీ సాయంత్రం లోపు పూర్తి చేయాలని కలెక్టరు ఆదేశాలు ఉన్నట్లు తహసీల్దారు మురళీమోహన్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ గ్రామ సచివాలయాల్లో వంద శాతం ఇళ్లపట్టాల రిజిస్ట్రేషన్ పూర్తి చేయాల్సి ఉందని అన్నారు. పూర్తి కాని వారు ఆర్డీవోకు సంజాయిషీ ఇవ్వాల్సి ఉంటుందని హెచ్చరించారు.

పనితీరు మెరుగుపడాలి

ఉయ్యాలవాడ, ఫిబ్రవరి 9: ఐఈఆర్టీ ఉపాధ్యాయులు తమ పని తీరును మెరుగు పరచుకోకుంటే చర్యలు తప్పవని ఐఈ స్టేట్ అసిస్టెంట్ కో-ఆర్డినేటర్ రాధిక అన్నారు. శుక్రవారం ఉయ్యాలవాడ, సంజామల, బనగానపల్లెలోని భవిత కేంద్రాలను ఐఈ జిల్లా కో-ఆర్డినేటర్ రఘు రామిరెడ్డితో కలిసి వారు తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎంఈవో ప్రతాప్ రెడ్డి, ప్రత్యేక ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


రికార్డులను తనిఖీ చేస్తున్న రాధిక